

కూటమి సర్కారుకు ఆరు నెలలు



కుప్పంలోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్

● అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యం ● రూ.2 వేల కోట్లకు పైగా నిధుల కేటాయింపు

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు పూర్తయింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి వెనకబడి అరాచకం, విధ్వంసం రాజ్యమేలడం చూసిన ప్రజలు సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో ప్రగతి పరుగులు తీయడాన్ని చూస్తున్నారు.ఈ ఆరు నెలల్లో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు జిల్లాలో రూ.2 వేల కోట్లకుపైగా ఖర్చు చేశారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

● హంద్రీనీవా కాంక్రీట్ లైనింగ్ పనులకు రూ.516 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది.

● ఎన్నికల హామీ మేరకు పెన్షన్ల సొమ్మును పెంచింది. జిల్లాలో 267,936 మందికి ప్రతి నెలా రూ.113.31 కోట్లను పంపిణీ చేస్తున్నారు.

● వైసీపీ సర్కారు మూసివేసిన చిత్తూరు, పుంగనూరు, కుప్పం, పలమనేరు మున్సిపాలిటీల్లో అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించారు.

● దీపావళి నుంచి మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని ప్రారంభించారు. జిల్లాలోని 543,200 కార్డుదారులకు ఏడాదికి మూడు చొప్పున, మొత్తం 16,29,600 సిలిండర్లను ఉచితంగా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు.



కుప్పం మండలం గరిగచీనేపల్లెలో నూతనంగా నిర్మించిన గోకులం షెడ్డు

● బంగారుపాళ్యం ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటైంది.పేద రోగులు డయాలసిస్ కోసం తరచూ ఇతర ప్రాంతాలకు వెళ్లే బాధ తప్పించారు.

● వైసీపీ హయాంలో చేపట్టిన రీసర్వేతో ఏర్పడిన చిక్కుల్ని పరిష్కరించేందుకు అక్టోబరులో గ్రామసభల్ని నిర్వహించి అర్జీలు స్వీకరించారు.ప్రస్తుతం గ్రామాలవారీగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నారు.

● జిల్లాలోని 697 గ్రామ పంచాయతీలకు కేంద్రం పలు మార్లు ఇచ్చిన ఆర్థిక సంఘం నిధులు రూ.120 కోట్లను వైసీపీ ప్రభుత్వం దారిమళ్లించేసిన విషయం తెలిసిందే. నిధుల లేమితో నీరసించిన పంచాయతీలకు పూర్వ వైభవం తెచ్చేందుకు ఇప్పటికే రెండు విడతల్లో రూ.60 కోట్లు విడుదల చేశారు.

● వైసీపీ ఐదేళ్ల పాటు పట్టించుకోకపోవడంతో గతుకులమయంగా మారిన 1709 కిలోమీటర్ల రహదారులను గుర్తించి రూ.22 కోట్లతో మరమ్మతు పనులు



కోటపల్లెలో నిర్మించిన సిమెంటు రోడ్డు

ప్రారంభించారు.గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.78.78 కోట్లను కేటాయించారు. ఏడు నియోజకవర్గాల్లో 1356 పనుల్ని గుర్తించి పనుల్ని ప్రారంభించగా.. 421 చోట్ల పూర్తయ్యాయి.ఏళ్లగా మోకాటిలోతు గుంతలతో అస్తవ్యస్తంగా వున్న చిత్తూరు- గుడియాత్తం రోడ్డును బాగు చేసేందుకు రూ.5.90 కోట్లను కేటాయించారు.

● చిత్తూరుతో పాటు కుప్పం మున్సిపాలిటీకి రెండు కేంద్రీయ విద్యాలయాలు మంజూరయ్యాయి.వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఇవి ప్రారంభం కానున్నాయి.

● కుప్పంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు చర్యలు వేగవంతమయ్యాయి. ఇటీవలే కేంద్ర విమానయాన సంస్థ అధికారులు రామకుప్పం, శాంతిపురం మండలాల్లో స్థలాలను పరిశీలించి వెళ్లారు.

● జిల్లాలోని పంచాయతీ కేంద్రాల్లో ఆగస్టు 23న గ్రామ సభల్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు తీసుకున్నారు. రూ.93 కోట్లతో 1407 పనుల్ని మంజూరు చేయగా ప్రస్తుతం పురోగతిలో వున్నాయి.

● ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేందుకు రూ.19.64 కోట్లు మంజూరయ్యాయి.కుప్పంలో ఇప్పటికే ఉద్యానవన పంటల కోసం సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ పేరుతో రీసెర్చ్ సెంటర్ ఉండగా.. తాజాగా శాంతిపురం మండలం తమ్మిగానిపల్లెలో కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

● పాడి సంక్షేమాభివృద్ధి కోసం 2076 గోకులం షెడ్లను ప్రభుత్వం మంజూరు చేసింది.రూ.49.63 కోట్లతో పనులు జరుగుతున్నాయి.

● పరిశ్రమల్ని ప్రోత్సహించేందుకు ఎంఎస్ఎంఈ సర్వే ప్రారంభించింది. ఇందులో పేర్లను నమోదు చేసుకున్న చిన్నస్థాయి దుకాణదారులకు పూచీకత్తు లేకుండా రూ.5లక్షల నుంచి రూ.10 లక్షల వరకు రుణాలను మంజూరు చేయనున్నారు.

● 2014-19 మధ్య టీడీపీ హయాంలో నిర్మించుకున్న ఇళ్లకు వైసీపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా బిల్లులు చెల్లించకుండా ఆపిన విషయం తెలిసిందే. ఇలా జిల్లాలో 29,093 మందికి రూ.47.19 కోట్లను అందించాల్సి ఉండగా.. అక్టోబరులో లబ్ధిదారులను గుర్తించే సర్వే పూర్తి చేశారు. త్వరలో బిల్లులు మంజూరు చేయనున్నారు.



రాష్ట్రపతి ద్రౌపదీముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సర్పంచ్ రఘురామయ్య

అవార్డందుకున్న బొమ్మసముద్రం సర్పంచ్

చిత్తూరు కలెక్టరేట్/ఐరాల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో ఆరోగ్యకర పంచాయతీగా ఎన్నికైన ఐరాల మండలం బొమ్మసముద్రం పంచాయతీ తరఫున సర్పంచ్ రఘురామయ్య అవార్డు అందుకున్నారు.బుధవారం సాయంత్రం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన వేడుకల్లో రాష్ట్రపతి ద్రౌపదీముర్ము సర్పంచ్ రఘురామయ్యకు అవార్డు, మెమెంటోను అందించారు. బొమ్మసముద్రం పంచాయతీ పరిధిలో ఏడాది కాలంగా శిశుమరణాలేవీ చోటుచేసుకోలేదు డెంగీ, మలేరియా వంటి జబ్బుల బారిన పడలేదు.వీటితోపాటు ఇతర ఆరోగ్యకర అంశాలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం బొమ్మసముద్రం పంచాయతీని ఈ అవార్డుకు ఎంపిక చేసింది. అవార్డు ప్రదాన కార్యక్రమంలో జడ్పీ సీఈవో రవికుమార్, డీపీవో సుధాకర రావు, ఎంపీడీవో ధనలక్ష్మి, ఈవోపీఆర్డీ కుసుమకుమారి, సెక్రటరీ మౌనిక, పంచాయతీరాజ్ అడిషనల్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.అవార్డుతో పాటు ప్రకటించిన రూ. కోటి పురస్కారాన్ని రాష్ట్రపతి బటన్ నొక్కి పంచాయతీ బ్యాంకు ఖాతాకు జమ చేశారు. అవార్డు వచ్చేందుకు కృషి చేసిన వైద్య ఆరోగ్య శాఖ అధికారులను జడ్పీ సీఈవో రవికుమార్, డీపీవో సుధాకర రావు అభినందించారు.ఈ స్ఫూర్తితో మిగిలిన పంచాయతీలు ఈ అవార్డు కోసం కృషి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆకాంక్షించారు. అవార్డు గ్రహీత రఘురామయ్యను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ అవార్డు తమ పంచాయతీకి రావడం చాలా ఆనందంగా ఉందన్న రఘురామయ్య ఇందుకు కృషి చేసిన మెడికల్ సిబ్బంది, పీహెచ్‌సీ డాక్టర్లు, ఆశావర్కర్లు, ఎంపీఎల్‌హెచ్,ఏఎన్ఎం,గ్రీన్ అంబాసిడర్లకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. అందరి సమష్టి కృషితోనే ఈ ఘనతను సాధించామన్నారు.

జీవీఏలో జిల్లాకు 18వ ర్యాంకు

● కలెక్టర్ల సదస్సులో వెల్లడించిన ప్రభుత్వం

చిత్తూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థూల విలువ జోడింపు (జీవీఏ)లో 3.10 శాతం వాటాతో మన జిల్లా రాష్ట్రంలో 18వ స్థానంలో నిలిచింది.అమరావతిలో బుధవారం ప్రారంభమైన సీఎం-కలెక్టర్ల రెండు రోజుల కాన్ఫరెన్సు సందర్భంగా ప్రభుత్వం ఈ మేరకు సమాచారం విడుదల చేసింది. తిరుపతి జిల్లాకు 4వ, అన్నమయ్య జిల్లాకు 23వ స్థానాలు దక్కాయి. వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగాల్లో ఉత్పత్తి విలువ మొత్తాన్ని జీవీఏ అంటారు. జీవీఏ నుంచి ఉత్పత్తి సబ్సిడీలను తీసేస్తే జీడీపీ వస్తుంది. మన జిల్లా వ్యవసాయ అనుబంధ రంగాల్లో 3.55% వాటాతో జీవీఏలో 7వ స్థానంలో ఉంది. అలాగే పరిశ్రమల రంగంలో రాష్ట్రస్థాయిలో 2.08%తో 21వ స్థానంలో ఉంది. సేవా రంగంలో 3.37% వాటాతో 14వ స్థానంలో నిలిచింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుకు సంబంధించి మెటీరియల్ కాంపొనెంట్ కింద నిధుల వ్యయంలో జిల్లా 10వ స్థానంలో నిలిచింది.అన్నమయ్య జిల్లా 11వ స్థానంలో వుండగా తిరుపతి జిల్లా 17.34 శాతంతో చివరి స్థానంలో నిలిచింది. ఉపాధి హామీ పథకం కింద చేపట్టే సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, కంకర రోడ్ల నిర్మాణ విషయంలో జిల్లా అట్టడుగు నుంచీ మూడవ స్థానంలో నిలిచింది.చిత్తూరు జిల్లా 24వ స్థానంలో వుండగా తిరుపతి జిల్లా 25వ స్థానంలో,అన్నమయ్య 21 స్థానంలో నిలిచాయి.



సదస్సులో పాల్గొన్న వివిధ జిల్లాల కలెక్టర్లతో చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కార్పొరేషన్‌లో అక్రమాలపై

విచారణాధికారి నియామకం

● పూర్వ కమిషనర్ అరుణపై ఫిర్యాదుల ఫలితం

చిత్తూరు అర్బన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో చిత్తూరు నగరపాలక సంస్థలో చోటు చేసుకున్న అవినీతి, అక్రమాలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. అప్పటి కమిషనర్ అరుణ అవినీతికి పాల్పడ్డారని ఆరోపిస్తూ రాష్ట్ర పురపాలక శాఖకు ఫిర్యాదులందాయి.ఈ నేపథ్యంలో ఏపీయూఎఫ్ఐడీసీ సహాయ డైరెక్టర్ నాగేంద్ర బియానీని విచారణాధికారిగా నియమించారు. త్వరలో ఆయన చిత్తూరు నగరపాలక కార్యాలయంలో విచారణ చేపట్టనున్నారు.

నీటి సంఘాల ఎన్నికల్లో బ్యాలెట్ బాక్సులు

● 14న ఓటెయ్యనున్న 49,030మంది రైతులు

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సాగు నీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు వేగవంతం చేసినట్లు డీఆర్వో, ఎన్నికల కో- ఆర్డినేటర్ మోహన్ కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 14న ఎన్నికలు జరిగే పాఠశాలలకు ఒక రోజు ముందుగానే ఎన్నికల సామగ్రిని తరలిస్తామన్నారు. జిల్లావ్యాప్తంగా 32 మండలాల్లోని 220 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నట్లు చెప్పారు. అత్యధికంగా నింద్ర మండలంలో 16, ఐరాల మండలంలో 14, అత్యల్పంగా గుడుపల్లెలో ఒక సాగు నీటి సంఘం ఉందన్నారు. 49,030 మంది ఓటర్లున్నారని చెప్పారు. ఎన్నికల నిర్వహణకు తనతో పాటు కో- ఆర్డినేటర్‌గా జలవనరుల శాఖ ఎస్ఈ విజయకుమార్‌రెడ్డి వ్యవహరిస్తారని చెప్పారు. ఎన్నికల నిర్వహణ కోసం 1357 మంది పీవోలు, 1357 మంది ఏపీవోలు, 182 మంది అసిస్టెంట్ ఎన్నికల అధికారులు, 32 మంది ఇరిగేషన్ ఏఈలను రూట్ ఆఫీసర్లుగా నియమించామని చెప్పారు. ప్రతి నీటి సంఘంలో ఆరుగురు సభ్యుల ఎంపిక కోసం 14వ తేది ఉదయం 10.30 గంటల నుంచి నామినేషన్లను స్వీకరిస్తామన్నారు.మధ్యాహ్నం 12.30 గంటల దాకా నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ, పోలింగ్, ఎంపికైన అభ్యర్థుల ప్రకటన వుంటుందన్నారు. అర్ధగంట విరామం తరువాత మధ్యాహ్నం ఒంటి గంటకు అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. ఎన్నికలకు పాఠశాలలను పోలింగ్ కేంద్రాలుగా గుర్తించామన్నారు. గతంలో చేతులెత్తే పద్ధతిలో ఎన్నికలు జరిగేవని, ఈ సారి బ్యాలెట్ పెట్టెలతో రహస్య పద్ధతిలో బ్యాలెట్ పేపర్లద్వారా జరుగుతాయన్నారు. పోలింగ్ కేంద్రాలకు ఓటర్లను 8 గంటల నుంచి అనుమతించి, ఎన్నికల ఉద్దేశం, సంఘాల బాధ్యతలు, ఓటింగ్ తీరును ఎన్నికల అధికారులు వివరిస్తారని చెప్పారు. ఎన్నికలకు ముందు రోజు చిత్తూరులోని జలవనరుల శాఖ ఎస్ఈ కార్యాలయం నుంచి బ్యాలెట్ పెట్టెలు, బ్యాలెట్ పత్రాలు, ఇతర సామగ్రిని తహసీల్దార్లతో కలిసి రూట్ ఆఫీసర్లు తీసుకెళతారని చెప్పారు. పోలింగ్ కేంద్రంగా గుర్తించిన పాఠశాలలోని ఒక గదిలో వాటిని భద్రపరిచి బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి సాగునీటి సంఘ పరిధిలో 40 నుంచి 250 మంది ఓటర్లున్నట్లు గుర్తించామని డీఆర్వో చెప్పారు.



డీఆర్వో మోహన్‌కుమార్

విభిన్న ప్రతిభావంతులకు, వయోవృద్ధులకు

ఉపకరణాల నమోదుకు

17 నుంచి 24 వరకు శిబిరాలు

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులకు, వయోవృద్ధులకు అవసరమైన ఉపకరణాల నమోదుకు జిల్లాలో ఎనిమిది రోజుల పాటు గుర్తింపు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి కలెక్టర్ విద్యాధరి బుధవారం తెలిపారు. ఈనెల 17న చిత్తూరు పీసీఆర్, 18న శ్రీరంగరాజపురం జడ్పీ హైస్కూల్, 19న పూతలపట్టు జడ్పీ హైస్కూల్, 20న నగరి పీసీఎస్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, 21న పుంగనూరు బీఆర్. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, 22న పలమనేరు జడ్పీ హైస్కూల్, 23న కుప్పం రాజావారి పార్కు, 24న రామకుప్పం జడ్పీ హైస్కూల్‌లో శిబిరాలు కొనసాగుతాయన్నారు.హాజరయ్యే వారు రెండు సెట్ల ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలన్నారు. విభిన్న ప్రతిభావంతులు ఉపకరణాల దరఖాస్తుకు వికలత్వ ఫోటోలు 4, ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్, యూడీఐడీ కార్డు, రేషన్ కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందజేయాలన్నారు. వయోవృద్ధులు ఫోటోలు 4, ఆధార్ కార్డు, రేషన్ కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తీసుకుని శిబిరాలకు హాజరై నమోదు చేసుకోవాలని ఆమె కోరారు.

పేద విద్యార్థులకు దన్నుగా ప్రభుత్వం

● చిత్తూరు,తిరుపతి జిల్లాల్లో

101 వసతి గృహాలకు రూ.15.17కోట్ల మంజూరు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ వసతి గృహాల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారించింది.ఐదేళ్ల వైసీపీ పాలనలో వసతి గృహాలను పట్టించుకోకపోవడంతో పెచ్చులూడిన పైకప్పులు, శిథిలమైన మరుగుదొడ్లు, వేలాడుతున్న విద్యుత్ వైర్లు, రెక్కలు విరిగిన ఫ్యాన్లు, నీళ్లు కారుతున్న గదుల్లోనే విద్యార్థులు బస చేయాల్సి వచ్చింది.చిత్తూరు కలెక్టర్ సుమిత్ కుమార్ బాధ్యతలు తీసుకున్న తొలి నాళ్లలోనే వసతి గృహాల మరమ్మతులపై దృష్టిసారించారు. విద్యార్థులకు ఏమి అవసరమో గుర్తించి ఒకటికి రెండుసార్లు నివేదికలు తెప్పించుకుని ప్రభుత్వానికి పంపారు.ఈ నేపథ్యంలో వసతి గృహాల్లో సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది.చిత్తూరు జిల్లా పరిధిలో 46 సాంఘిక సంక్షేమ వసతి గృహాలున్నాయి. వీటిలో మైనర్ రిపేర్ల కింద మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.86.04 లక్షలు, తాగునీటి సరఫరాకు రూ.109.83 లక్షలు, ఎలక్ట్రిఫికేషన్‌కు రూ.114.75 లక్షలు, కిటికీలకు మెష్‌ల ఏర్పాటుకు రూ.66.15 లక్షలు, డోర్లు, విండోల మరమ్మతులకు రూ.44.27 లక్షలను కేటాయించారు. మేజర్ రిపేర్ల కింద రూఫ్ మరమ్మతుల కోసం రూ.94.67లక్షలు, ఫ్లోరింగ్‌కు రూ.70.38 లక్షలు, ప్రహరీ నిర్మాణాలకు



ఓ హాస్టల్లో పాడైపోయిన కిటికీలపై దుస్తులను ఆరేసుకున్న విద్యార్థులు

రూ.91.83లక్షలు, ఇతర పనుల కోసం రూ.205.71 లక్షలు కేటాయించారు.తిరుపతి జిల్లాకు సంబంధించి మైనర్ రిపేర్ల కింద మరుగుదొడ్ల నిర్మాణాలకు రూ.122.71 లక్షలు, తాగునీటి సరఫరాకు రూ.82.11 లక్షలు, ఎలక్ట్రిఫికేషన్ కోసం రూ.81.24లక్షలు, మెష్‌ల ఏర్పాటుకు రూ.46.80 లక్షలు, డోర్లు, విండోల కోసం రూ.67.92 లక్షలు, అవసరమైన ఇతర పనుల కోసం రూ.83.82 లక్షలను కేటాయించారు. మేజర్ రిపేర్ల కింద రూఫ్ మరమ్మతుల కోసం రూ.78.63 లక్షలు, ఫ్లోరింగ్ కోసం రూ.63.50 లక్షలు, ప్రహరీ నిర్మాణాల కోసం రూ.7.30 లక్షలు కేటాయించారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఈ పనులను చేపట్టి ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని మౌఖికంగా ఆదేశాలు జారీ చేసింది.

అక్కదేవతలారా దీవించండి!



తిరుమల మొదటి ఘాట్‌లో అవ్వాచారి కోన వద్ద అక్కదేవతల ఆలయం ఉంది. దాదాపు 80 ఏళ్ల చరిత్ర ఈ ఆలయానికి ఉంది. 1940లలో తిరుమలకు తొలి కనుమదారి నిర్మాణం జరుగుతున్నపుడు ఇక్కడ అక్కదేవతల శిలలు కనిపించాయి. వాటిని తొలగించి నిర్మాణం కొనసాగించారు. అయితే అనేక అవరోధాలు ఎదురవుతూ నిర్మాణం క్లిష్టంగా మారిందని, ఆ సమయంలో అక్కదేవతల ప్రాముఖ్యం గురించి స్థానికులు అధికారులకు వివరించారని అంటారు. దాంతో వారు వెంటనే సప్తమాతృకలను రోడ్డుపక్కనే ఉన్న పెద్ద బండరాతికింద ప్రతిష్ఠంచారని చెబుతారు. అప్పటి నంచీ అక్కదేవతలకు పూజలు జరుగుతున్నాయంటారు. తిరుమల ఘాట్‌లో క్షేమంగా ప్రయాణాలు జరగాలని కోరుకుంటూ టీటీడీ రవాణా విభాగం 2008 నుంచీ అక్కదేవతలకు కార్తీక మాసంలో ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా కొనసాగిస్తోంది. శుక్రవారం ఉదయం ఇక్కడ టీటీడీ డ్రైవర్లు, స్థానికులు కలిసి ఘనంగా పూజలు నిర్వహించనున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



శ్రీవారి సేవలో నటి వాసుకి

తిరుమల శ్రీవారిని బుధవారం సినీనటి, ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్‌సాయి సతీమణి వాసుకి దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆమె దర్శనం చేసుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఎలక్ట్రిక్ చోటా లగేజీ స్కూటర్



ఇది ఆటో కాదు.. ట్రాలీ కాదు.. బ్యాటరీతో నడిచే లగేజీ వాహనం. తిరుపతి నగరంలో సందుగొందుల్లో శబ్దం లేకుండా దూసుకుపోతూ సందడి చేస్తోంది. వివిధ ప్రాంతాల్లోని ప్రభుత్వ బడులకు మధ్యాహ్నభోజనం తీసుకువెళ్లేందుకు ఇస్కాన్ సంస్థ ఈ వాహనం వినియోగిస్తోంది. చిన్న సందుల్లో వెళ్లడం ట్రాలీలకు కష్టంగా మారడంతో తమకు ఉపయోగపడేలా ఎలక్ట్రిక్ లగేజీ స్కూటర్‌ను మలచుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లో మినీ బ్యాటరీ ఆటోల గురించి తెలుసుకుని అనంతపురంలో ఒక లగేజీ స్కూటర్‌ను కొని ఇలా ట్రక్కులా మార్చుకున్నారు. ఇందుకోసం రూ.2 లక్షలు ఖర్చయింది. ఎండా,వానా ఏదొచ్చినా ఆహారపదార్థాలకు ఇబ్బంది లేకుండా బడులకు ఈ వాహనం చేరవేస్తోంది.

-తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి



హుండీ ఆదాయం రూ.4.27 కోట్లు

తిరుమల, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8గంటల సమయం పడుతోంది.బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో16 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచివున్నారు.

హుండీ(సోమవారం నాటిది) ద్వారా: రూ.4.27 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 67,284

తలనీలాలు సమర్పించినవారు: 19,064

శ్రీకాళహస్తిలో ఏడు గంగల వేడుక



భేరివారిమండపం (గంగమ్మ(ముత్యాలమ్మ)



జయ రామారావువీధి గంగమ్మ(కావమ్మ)



కొత్తపేట గంగమ్మ (భువనేశ్వరి)




పెండ్లిమండపం గంగమ్మ(పొన్నాలమ్మ)



బ్రాహ్మణవీధి నల్లగంగమ్మ(నల్లగంగమ్మ)



సన్నిధివీధి గంగమ్మ (అంకాలమ్మ)



గాంధీవీధి గంగమ్మ(అంకమ్మ)

శ్రీకాళహస్తి,డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి):శ్రీకాళహస్తిలో బుధవారం ఏడుగంగమ్మల జాతర వైభవంగా జరిగింది. గంగమ్మలను దర్శించుకునేందుకు భక్తజనం పోటెత్తడంతో వీధులు కిక్కిరిసిపోయాయి. శ్రీకాళహస్తి పట్టణంలో యేటా డిసెంబరులో ఏడుగంగమ్మల జాతర నిర్వహించడం ఆనవాయితీ. మంగళవారం శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అమ్మవార్లకు సారె సమర్పించారు. ఏడు ప్రాంతాల్లోని ఏడుగంగమ్మలను విశేషంగా అలంకరించి ఊరేగింపుగా బుధవారం వేకువజామున 3 గంటల సమయంలో శ్రీకాళహస్తి న్యాయస్థాన భవనం సమీపంలోని ఏడుగంగమ్మల ఆలయం వద్దకు చేర్చారు. కుంభం, ప్రత్యేక పూజలు అనంతరం అమ్మవార్ల ముసుగు తొలగించి భక్తులకు దర్శనం కల్పించారు. అక్కడి నుంచి ఏడుగురు అమ్మవార్లనూ ఒకరి వెనుక వరుసగా ఊరేగించారు. తప్పెట్లు, తాళాలు, మంగళవాయిద్యాలు, బ్యాండు మేళాలు మధ్య భక్తులు తన్మయత్వంతో చిందులేశారు. బుధవారం రాత్రి ఏడుగంగమ్మలూ ముత్యాలమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. పూజల అనంతరం నిమజ్జనం నిర్వహించారు.

డిగ్రీ పరీక్షల్లో పది మంది డీబార్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ 3, 5 వ సెమిస్టర్ పరీక్షల్లో బుధవారం మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న పది మంది విదార్థులను డీబార్ చేశారు. తిరుపతిలో ముగ్గురు, చిత్తూరులో ఏడుగురిని డీబార్ చేసినట్టు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

సముద్రంలో 'అల'జడి

● ఆగిన చేపల వేట

కోట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో చదురు మదురుగా వర్షంతోపాటు చలిగాలులు వీస్తుండటంతో బుధవారం మత్స్యకారులు చేపల వేటను నిలిపివేశారు. కోట మండలంలోని పలు సముద్రతీర గ్రామాల్లో ఈదురు గాలులతో కూడి వర్షపుజల్లులు పడుతున్నాయి. శ్రీనివాససత్రం, కొత్తపట్నం, గోవిందపల్లిపాళెం గ్రామాల సమీపంలో ఉన్న సముద్రం కసురుపై ఉండి ఒక్కసారిగా అలల ఉధృతి పెరగడంతో మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు అప్రమత్తంగా ఉన్నారు.

భూవివాదం కోర్టులో వున్నా దౌర్జన్యంగా కంచె తొలగించారు!

● పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

తిరుపతి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు సర్వే నెంబరు 478లో నా భూమి విషయమై తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి కుటుంబీకులతో వివాదం హైకోర్టులో పెండింగులో ఉండగానే.. దౌర్జన్యంగా కొందరు కంచెను తొలగించారంటూ బాధితుడు చెరుకూరు వెంకటేశ్వర ప్రసాద్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనకు తండ్రి ద్వారా సంక్రమించిన ఆ భూమిని ఇచ్చేయాలంటూ కొంతకాలం కిందట అప్పటి తిరుపతి ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి, ఆయన సతీమణి రేవతీరెడ్డిల ప్రోద్బలంతో కొందరు తమపై పలుమార్లు బెదిరింపులకు పాల్పడ్డారని అందులో పేర్కొన్నారు. తన భూమిలోని 64 టేకు చెట్లు, 40 మామిడి చెట్లను కూడా నరికివేశారని, దానికి సంబంధించిన వీడియో క్లిప్పులను కూడా ఫిర్యాదు వెంట జతచేశారు. దీనిపై తాను హైకోర్టును ఆశ్రయించగా కేసు పెండింగులో ఉందని పేర్కొన్నారు. తాజాగా బుధవారం కొందరు వ్యక్తులు తన భూమిలోకి ప్రవేశించి ఎక్స్‌కవేటరుతో దౌర్జన్యంగా కంచెను తొలగించారని పేర్కొన్నారు. దీనికి సంబంధించిన వీడియో క్లిప్పులను కూడా ఫిర్యాదుతో పాటు పంపించారు. గతంలో లాగానే మళ్లీ బెదిరింపులకు పాల్పడుతున్నందున తమకు ప్రాణహాని ఉందని ఆందోళన వ్యక్తం చేసిన బాధితుడు.. దీనిపై ప్రభుత్వం జోక్యం చేసుకుని నిందితులను శిక్షించాలని కోరారు. ఈ వ్యవహారంలో ప్రమేయమున్న అందరిపై కేసు నమోదు చేయాలని, తనకు రక్షణ కల్పించాలని పోలీసు అధికారులను బాధితుడు కోరారు. కాగా, బాధితుడు చెరుకూరు వెంకటేశ్వర ప్రసాద్ కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ సంప్రదింపుల కమిటీలో సభ్యుడిగా ఉన్నారు. అలాగే ఎఫ్‌సీఐకి సంబంధించి ఏపీకి ఎస్ఎల్‌సీసీ కమిటీ సభ్యుడుగానూ వ్యవహరిస్తున్నారు.

ఆహార కొరతను అధిగమించేలా

పరిశోధనలు జరగాలి

● జాతీయ సదస్సులో పశువైద్య విద్యార్థులకు పిలుపు



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రకాశ్‌రావు, షెజియన్ తదితరులు

తిరుపతిరూరల్, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఆహార కొరతను అధిగమించేందుకు సరికొత్త పరిశోధనలు ఆవిష్కరించాలని చెన్నైకి చెందిన ప్రకాశ్ ఫుడ్‌మీల్స్ సంస్థ అధినేత డాక్టర్ ప్రకాశ్‌రావు సూచించారు. తద్వారా భావితరాలకు ఆహార భద్రత కల్పించాలన్నారు. 'పశువుల ఆరోగ్యం, ఉత్పత్తి' అంశాలపై దేశంలోనే తొలిసారిగా పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు ఎస్వీవెటర్నరీ కళాశాల వేదికగా చేపట్టిన రెండు రోజుల జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. పశువైద్య విద్య విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదిగి తమతోపాటు ఇతరులకు కూడా ఉపాధి కల్పించాలన్నారు. పారిశ్రామికవేత్తగా తన ఎదుగుదలను వివరించి విద్యార్థుల్లో స్ఫూర్తినింపారు. దేశీయ ఆవుల, గేదె జాతుల జన్యుసమర్థతను ఉపయోగించుకుని భవిష్యత్‌తరాలకు మేలైన దేశీయ పశుజాతి రకాలు అందించాలని పాండిచ్చేరి వెటర్నరీ కళాశాల డీన్ డాక్టర్ షెజియన్ ఆకాంక్షించారు. తొలిసారిగా పీజీ, పీహెచ్‌డీ విద్యార్థుల పరిశోధనాంశాలకు సంబంధించి జాతీయస్థాయి సదస్సు నిర్వహించడం అభినందనీయమని కేంద్ర పశుసంవర్ధకశాఖ మాజీ కమిషనర్ డాక్టర్ సురేష్ హోన్నప్పగల్ కొనియాడారు. వివిధ సెషన్స్‌లో దాదాపు 130 పరిశోధనాంశాలను ప్రజంటేషన్ చేయనున్నారని, వీటిలో ఉత్తమ పరిశోధనాపత్రాలను ఎంపిక చేసి అవార్డులు ప్రదానం చేస్తామని సదస్సు కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ పి.జగపతి రామయ్య వివరించారు. ఈ సందర్భంగా సదస్సు సావనీర్‌ను ఆవిష్కరించారు. పలువురు పరిశోధకులు తమ పరిశోధనాంశాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పి.రవికుమార్, డీన్ డాక్టర్ కె.వీరబ్రహ్మయ్య, డాక్టర్ కె.సుధీర్, డాక్టర్ మురళి, డాక్టర్ చైతన్య, డాక్టర్ రాజా తదితరులు పాల్గొన్నారు.



రంగనాథుడికి టీటీడీ పట్టు వస్త్రాల సమర్పణ

తిరుమల, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం శ్రీరంగంలోని రంగనాథ స్వామికి బుధవారం టీటీడీ తరపున బుధవారం ఈవో శ్యామలరావు పట్టువస్త్రాలు సమర్పించారు. దేశవ్యాప్తంగా ఉన్న ముఖ్యమైన పుణ్యక్షేత్రాలకు టీటీడీ 2008 నుంచి పట్టువస్త్రాలను సమర్పిస్తోంది. అందులోభాగంగా ఈఏడాది కూడా శ్రీరంగం ఆలయానికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ ప్రధాన ద్వారం వద్దకు చేరుకున్న టీటీడీ ఈవోకు శ్రీరంగం ఆలయ జాయింట్ కమిషనర్ మరియప్పన్ స్వాగతం పలికారు. అనంతరం ఈవో.. పీఠాధిపతికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రధాన ఆలయ సముదాయంలో ఉన్న మూలవిరాట్ ఇతర ఉప ఆలయాలను దర్శించుకున్నారు. సాధారణంగా శ్రీరంగం ఆలయ అధికారులు ఏటా ఆణివారి ఆస్థానం రోజున తిరుమల ఆలయానికి వస్త్రాలను సమర్పిస్తారు. ఈ పవిత్ర కార్తీక మాసం ఏకాదశి రోజున శ్రీరంగం ఆలయానికి టీటీడీ పట్టువస్త్రాలను అందజేస్తుంది. ఈ కార్యక్రమంలో టీటీడీ ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, ఇతర టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

18న ఆర్టీసీ అప్రెంటిస్‌షిప్ కౌన్సెలింగ్

తిరుపతి(ఆర్టీసీ), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌నకు ఎంపికైన అభ్యర్థులు శిక్షణ, డిపోల అలాట్‌మెంట్‌కు ఈనెల 18న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ డీపీటీవో జగదీష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. డీజిల్ మెకానిక్ 39, మోటార్ 2, ఎలక్ట్రీషియన్ 17, వెల్డర్ 1, పెయింటర్ 1, ఫిట్టర్ 2 మొత్తం 62 ఖాళీలున్నాయి. ఐటీఐ అభ్యర్థులు ఆ రోజున ఉదయం 10 గంటలకు సర్టిఫికెట్లతో జిల్లా ప్రజా రవాణాధికారి కార్యాలయానికి హాజరుకావాలని కోరారు.

మోహన్‌బాబుపై హత్యాయత్నం కేసు పెట్టాలి

● ఎస్పీ కార్యాలయం వద్ద జర్నలిస్టుల ధర్నా

తిరుపతి (నేరవిభాగం), డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులపై దాడి చేసిన సినీ నటుడు మోహన్‌బాబు, ఆయన అనుచరులపై హత్యాయత్నం కేసులు నమోదు చేయాలని జర్నలిస్టులు డిమాండు చేశారు. ఈ మేరకు తిరుపతి ఎస్పీ కార్యాలయం వద్ద బుధవారం ఏపీయూడబ్ల్యుజే, ప్రెస్‌క్లబ్, ఫొటోగ్రాఫర్ల సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. హైదరాబాదులో మోహన్‌బాబు, మోహన్‌బాబు యూనివర్సిటీ వద్ద సుమన్ టీవీ ప్రతినిధి ఉమాశంకర్, కెమెరామేన్ నరసింహపై బౌన్సర్లు దాడికి పాల్పడటం దారుణమని ఏపీయూడబ్ల్యుజే అధ్యక్షుడు ప్రసాద్ అన్నారు. వీడియో షూట్ చేస్తున్న తమను కొందరు బౌన్సర్లు అడ్డుకోవడంపై పీఆర్వో సతీష్ వచ్చి మాట్లాడుతుండగా.. వెనుక వైపు నుంచి 10 మంది బౌన్సర్లు వచ్చి తమపై దాడి చేసి కొట్టారని ఉమాశంకర్ తెలిపారు. పోలీసులు విచారణ జరిపి జర్నలిస్టులపై దాడులు చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని తిరుపతి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మురళి డిమాండు చేశారు. హైదరాబాదు, తిరుపతిలో జరిగిన ఘటనలపై కఠిన చట్టాల కింద కేసులు నమోదు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని ఏపీయూడబ్ల్యుజే రాష్ట్ర కార్యదర్శి నరేంద్ర కోరారు. అనంతరం అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారికి వినతిపత్రం అందచేశారు. ఏపీ ఫొటోగ్రాఫర్ల సంఘం నేత గిరిబాబు, ప్రెస్‌క్లబ్ కార్యదర్శి బాలచంద్ర, సీనియర్ జర్నలిస్టులు దినేష్, రాజు, కల్లుపల్లి సురేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నూతన ఆవిష్కరణలే దేశాన్ని అగ్రగామిగా నిలుపుతాయి

● ఐఐటీలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ ఫినాలే పోటీల ప్రారంభం

ఏర్పేడు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): 'దేశంలో సాంకేతిక, విద్యారంగాల్లో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ కార్యక్రమం నూతన ఒరవడికి నాంది పలుకుతంది. ఈ కార్యక్రమం ద్వారా నూతన ఆవిష్కరణలెన్నో రూపొంది దేశాన్ని అగ్రగామిగా నిలుపుతుంది' అని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎన్ సత్యనారాయణ అన్నారు. ఏర్పేడు సమీపంలోని ఐఐటీ ప్రాంగణంలో ఉన్న ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బుధవారం హ్యాకథాన్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ ప్రారంభ వేడుకల్లో ఆయనతో పాటు తిరుపతి ఎస్వీ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రేణుదీక్షిత్ పాల్గొని ప్రారంభోపన్యాసం చేశారు. దేశవ్యాప్తంగా 51 నోడల్ కేంద్రాల్లో జరుగుతున్న ఈ ఫినాలే పోటీల్లో 1,300 మంది యువ ఆవిష్కర్తల బృందాలు వివిధ అంశాలపై నూతన ఆవిష్కరణలు, కోడ్ సొల్యూషన్ ప్రక్రియలు చేపడుతున్నాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో ఏర్పేడు ఐఐటీ ప్రాంగణంలో ఆరుగురు సభ్యులు, ఇద్దరు మెంటార్లు, 21 జట్లు సాఫ్ట్‌వేర్ కోడ్ సొల్యూషన్ ప్రక్రియ చేపడుతున్నారు. ఆయుష్ అంశాలపై కేంద్ర విద్య, ఆయుష్ శాఖల ద్వారా అందించిన సవాళ్లకు కొత్త ఆవిష్కరణలపై నిరంతరాయంగా 36 గంటల మేధో మదనాన్ని ప్రారంభించారు. ఉదయం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వర్చువల్‌గా దేశవ్యాప్తంగా ఫినాలే మారథాన్‌ను ప్రారంభించారు.

శాస్త్ర సాంకేతిక రంగాల్లో విప్లవాత్మకమార్పులు

దశాబ్దకాలంగా దేశంలో శాస్త్ర సాంకేతిక రంగాల్లో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ యువ ఆవిష్కర్తలకు వివరించారు. సాయంత్రం ఆయన 51 నోడల్ కేంద్రాల్లో పాల్గొన్న వారితో వర్చువల్‌గా మాట్లాడారు. 2017లో జరిగిన హ్యాకథాన్‌లో 7వేల నూతన ఆవిష్కరణలు చేయగా ప్రస్తుతం 57వేలకు చేరిందన్నారు. శాస్త్ర, సాంకేతికరంగాల్లో ప్రపంచ దేశాలకు దిక్సూచిగా నిలిచామన్నారు.





వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు, అధ్యాపకులు - టీమ్ స్టాక్ స్క్వాడ్ చేస్తున్న కోయంబత్తూరు విద్యార్థులు

గదుల కోసం భక్తుల పాట్లు



గదుల కోసం 'పద్మావతి' ముందు నిరీక్షిస్తున్న భక్తులు

తిరుమల, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనం కోసం బుధవారం తిరుమలకు వచ్చిన భక్తులు వసతి కోసం ఇబ్బంది పడ్డారు. సామాన్య భక్తులకు గదులు కేటాయించే సీఆర్వోలోని కౌంటర్లు సాయంత్రానికే మూతపడ్డాయి. సిఫార్సు లేఖలపై గదులు కేటాయించే పద్మావతి, ఎంబీసీ24 కౌంటర్లు భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రానికి ఈ గదులూ బుక్ అయ్యాయి. ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ, మంత్రులు వంటి ప్రజాప్రతినిధులు పరిమితికి మించి గదులు పొందటంతోనే ఈసమస్య వచ్చినట్టు తెలుస్తోంది. ఒక్కో ప్రజాప్రతినిధి రెండు నుంచి మూడు గదులు పొందుతున్నట్టు సమాచారం. దీంతో ఎన్నడూ లేనివిధంగా సాయంత్రానికి పద్మావతిలోని గదులన్నీ బుక్ అయ్యాయి. ఈ మేరకు కౌంటర్లలోని సిబ్బంది మైకులద్వారా ప్రచారం చేశారు. దీంతో రిసెప్షన్ అధికారులు సాధారణ గదులనే పద్మావతికి మళ్లించి సిఫార్సు లేఖలపై అడపాదడపా కేటాయిస్తూ అర్ధరాత్రి వరకు నెట్టుకొచ్చారు. మరోవైపు ఎంబీసీలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. రద్దీ సాధారణంగానే ఉన్నప్పటికీ గదుల కొరత మాత్రం భక్తులను ఇబ్బందులకు గురిచేసింది.

చిన్నారికి సీఎం నామకరణం

కుప్పం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండల తెలుగు యువవత అధ్యక్షుడు ఎం.సుబ్బు కుమార్తెకు ముఖ్యమంత్రి చంద్రబాబు నామకరణం చేశారు. సుబ్బు తన సతీమణితో కలిసి అమరావతిలో సీఎంను కలిశారు. ఈ సందర్భంగా వారి చిన్నారికి ఎస్.పన్విత అని చంద్రబాబు నామకరణం చేసి ఆశీర్వదించారు.



చిన్నారిని ఎత్తుకున్న చంద్రబాబుతో సుబ్బు దంపతులు

నేనుచేసిన పాపమేంటి?

కైగల్ జలపాతం ఆత్మఘోష

ప్రకృతి రమణీయతకు మారుపేరుగా నిలిచి పర్యాటకులకు కనువిందు చేస్తూ కైగల్ దుముకురాళ్ల జలపాతంగా ప్రత్యేక గుర్తింపు పొందిన నేను ఇప్పుడు కళావిహీనంగా తయారయ్యా. నన్ను సద్వినియోగం చేసుకుని రైతుల కష్టాలు తీరుస్తారనుకుంటే ఎత్తిపోతల పథకం అమలు కావడంలో జాప్యం జరుగుతూనేవుంది. చెరువులకు అనుసంధానంగా నన్ను ఎప్పుడు మళ్లిస్తారో నా సన్నిధిలో ప్రతిష్ఠించివున్న శివుడికే ఎరుక. కర్ణాటక నుంచి నీటిప్రవాహమంతా నా దగ్గరకు వచ్చి పలకరించి వృధాగా తమిళనాడుకు వెళుతుంటే ఎంతో బాధ కలుగుతోంది. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల కారణంగా జలజాడ లేదు. ఇక పర్యాటక ప్రదేశంగానైనా అభివృద్ధి చేస్తారా అంటే అదీలేదు. కనీసం నా దగ్గరకు రావడానికి సరైన రహదారి సౌకర్యం కల్పించడంపైనా ఎవరూ శ్రద్ధ చూపడంలేదు. ప్రకృతి అందాలను ఆస్వాదించాల్సిన చోట గతంలో అత్యాచారాలు, మద్యంమత్తులో అల్లరిమూకల దాడులు జరగడంతో పర్యాటకులు రావడానికే భయపడుతున్నారు.ఇంత దుస్థితికి నేను చేసిన పాపమేంటో అర్థం కావడంలేదు. నాకు మళ్లీ పూర్వవైభవం రావడానికి నాచెంతనే వున్న నిత్యజల నీలకంఠేశ్వరస్వామిని వేడుకోవడం తప్ప వేరే మార్గం కనిపించడంలేదు.

- బైరెడ్డిపల్లె, ఆంధ్రజ్యోతి



రూ.30 లక్షలతో నర్సరీల అభివృద్ధి

డీఎఫ్‌వో జ్ఞానప్రకాశరావు



చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సామాజిక వన విభాగం కింద జిల్లాలో రూ.30 లక్షల ఉపాధిహామీ నిధులతో నర్సరీలు అభివృద్ధి చేయనున్నట్లు సామాజిక వన విభాగం డీఎఫ్‌వో జ్ఞానప్రకాశరావు అన్నారు. బుధవారం ఆయన తన ఛాంబర్‌లో మాట్లాడుతూ మొక్కల పెంపకం, నర్సరీల అభివృద్ధికి సంబంధించి కలెక్టర్ అనుమతులు వచ్చాయన్నారు. జిల్లాలో వర్షాలు విస్తారంగా కురుస్తున్న తరుణంలో నర్సరీల్లో మొక్కల పెంపకం వేగవంతం చేయడంతో పాటు అడవుల్లో మొక్కలు నాటే ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లాలో తవణంపల్లి, ఐరాల, బంగారుపాళ్యం, పెద్దపంజాణి, గంగవరం, బైరెడ్డిపల్లి రామకుప్పం నర్సరీల్లో అల్లనేరేడు, బాదం, కానుగ, వేప, రావి, మర్రి, తపస్వీ, మహగణి, తెల్లమద్ది రకాల 30 లక్షల మొక్కలు పెంచనున్నామన్నారు. 7/8 సైజు బ్యాగులో 6 లక్షలు, 5/9 బ్యాగులో 10 లక్షలు, 6/12 బ్యాగులో 11 లక్షలు, 8/12 బ్యాగులో 2.5 లక్షలు, 12/18 బ్యాగులో 50 వేల మొక్కలు పెంపకం చేస్తామని తెలిపారు. వీటిటో పాటు సామాజిక వన విభాగం ద్వారా రూ.1.26 లక్షలతో పుంగనూరు బట్టందొడ్డి, చిత్తూరు ఉడ్‌యాపిల్, తవణంపల్లి మండలం లింగాలబావి నర్సరీలను అభివృద్ధి చేయనున్నట్లు ఆయన చెప్పారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రజలు సైతం మొక్కలు నాటే కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని, సామాజిక సేవ చేయడంలో భాగంగా మొక్కలు నాటే వారికి అవసరమైన మొక్కలు ఇవ్వనున్నట్లు జ్ఞానప్రకాశరావు తెలిపారు.

రెవెన్యూ సదస్సులకు పెరుగుతున్న ఆదరణ



బంగారుపాళ్యం మండలం నలగాంపల్లెలో జరిగిన రెవెన్యూ సదస్సులో అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మురళి

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెవెన్యూ సదస్సులకు రైతుల నుంచి మంచి స్పందన వ్యక్తమవుతోంది. బుధవారం 40రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు జరగ్గా రికార్డుస్థాయిలో 3142మంది రైతులు హాజరయ్యారు. ఇంతవరకు 2001 అర్జీలు రాగా, బుధవారం మరో 862 అర్జీలందాయి.వీటిలో ఆర్వోఆర్‌కు 300, ఇళ్లస్థలాల కోసం 221, రీసర్వే కోసం 73, ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాలపై 29, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై 29 అర్జీలు వున్నాయి.

ఓఆర్‌ఐ జర్నల్ విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఓఆర్‌ఐ నిర్వహించే జర్నల్‌ను వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ఓఆర్‌ఐ డైరెక్టర్ వెంకటేశ్వర్లు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఓఆర్‌ఐ 64వ త్రిభాషా జర్నల్‌ను వెలువరించడం గొప్ప విషయమన్నారు. ప్రాచీన గ్రంథాల పరిరక్షణ, పరిష్కరణ, డిజిటలైజేషన్ ద్వారా ప్రాచీన వారసత్వ సంపదను కాపాడటానికి ఓఆర్‌ఐ ఎంతో కృషి చేస్తోందన్నారు. టీటీడీ సహకారంతో ఓఆర్‌ఐని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు.



జర్నల్‌ను విడుదల చేస్తున్న వీసీ అప్పారావు

వైద్యులకు ముగిసిన శిక్షణ

తిరుపతి(వైద్యం), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నూతన వైద్య విధానాలపై ఎస్వీ వైద్య కళాశాలలో మూడు రోజులుగా వైద్య అధ్యాపకులకు నిర్వహిస్తున్న శిక్షణా తరగుతులు బుధవారంతో ముగిశాయి. ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ వైద్య విద్యలో నూతన అధ్యయనాలపై నిర్వహించే ఇటువంటి కార్యక్రమాలు కొత్త విషయాలు నేర్చుకునేందుకు దోహదపడతాయన్నారు. వైద్యులు మార్పులను ఎప్పటికప్పుడు నేర్చుకుంటూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో రుయా, ప్రసూతి ఆస్పత్రుల సూపరింటెండెంట్లు రవిప్రభ, పార్థసారథిరెడ్డి, వైద్య విభాగాధిపతులు రమ్య పాల్గొన్నారు.

భగవద్గీతతో ఆధ్యాత్మిక మార్గదర్శనం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న రఘునాథ్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): భగవద్గీత ద్వారా భక్తి, ఆధ్యాత్మిక మార్గదర్శనం జరుగుతుందని టీటీడీ ధర్మప్రచార పరిషత్ (డీపీపీ) కార్యదర్శి రఘునాథ్ పేర్కొన్నారు. భగవద్గీత కంఠస్థ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతుల ప్రదాన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. డీపీపీ ఆధ్వర్యంలో అన్నమాచార్య కళా మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రఘునాథ్ మాట్లాడారు. సమాజాన్ని సన్మార్గంలో నడిపే శక్తి భగవద్గీతకు ఉందన్నారు. చెడుపై మంచి విజయం సాధించడమే గీతా సారాంశమన్నారు. సభలో సంస్కృత ఆచార్యులు చక్రవర్తి రాఘవన్, సముద్రాల దశరథ్, రామకృష్ణ శేషసాయి, సునీత, శేఖర్‌రెడ్డి, శ్రీనివాసరావు, భాగ్యలక్ష్మి గీతా సారాంశంపై మాట్లాడారు. కార్యక్రమంలో డీపీపీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కోకిల పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ శాఖలోకి ఆరు కార్పొరేషన్లు

అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా వెనుకబడిన శాఖ (ఈడబ్ల్యూఎస్) పరిధిలోకి ఆరు కార్పొరేషన్లను తీసుకొస్తూ బీసీ సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ రెడ్డి సంక్షేమ కార్పొరేషన్, కమ్మ సంక్షేమ కార్పొరేషన్, బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్, క్షత్రియ సంక్షేమ కార్పొరేషన్, ఆర్యవైశ్య కార్పొరేషన్, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల సంక్షేమ కార్పొరేషన్లను పాలనకు అనుకూలంగా ఈడబ్ల్యూఎస్ శాఖ పరిధిలోకి తీసుకొచ్చారు.

ఆశీర్వాద్ ఫైనాన్స్‌లో మాజీ మేనేజర్ చేతివాటం

ఖాతాదారుల పేరిట రూ.22లక్షల రుణాలు తీసుకుని పరార్

రామకుప్పం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రామకుప్పంలోని ఆశీర్వాద్ ఫైనాన్స్‌లో మాజీ మేనేజర్ చేతివాటం చూపారు. ఖాతాదారుల బంగారు రుణాలను రెన్యువల్ చేయించి వారి పేరుతో రూ.22 లక్షల తీసుకుని ఉడాయించాడు. సుమారు 35మంది ఖాతాదారుల పేర్లు, ఫొటోలు, చిరునామాలను వాడుకుని అతను ఈ మోసానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఫైనాన్స్ నిర్వాహకులు అతడిని విధుల నుంచి తొలగించారు గానీ బాధితులకు భరోసా ఇవ్వడం లేదు. ప్రతిరోజూ ఎవరో ఒకరు బాధితులు కార్యాలయానికి రావడం తమ నగలు తమకు ఇచ్చేయాలని సిబ్బందితో వాగ్వాదానికి దిగడం పరిపాటిగా మారింది. బుధవారం తాజాగా కొందరు బాధితులు అక్కడకు చేరుకుని సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. తమ నగలు తమకివ్వాలని నిలదీశారు. ఫైనాన్స్ కంపెనీ నిర్వాహకులు వచ్చి న్యాయం చేసేవరకు ఇక్కడి నుంచి వెళ్లేది లేదని స్పష్టంచేశారు. గురువారం న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో బాధితులు వెనుదిరిగారు.



రామకుప్పం ఆశీర్వాద్ ఫైనాన్స్ వద్ద సిబ్బందితో వాగ్వాదంకు దిగిన బాధితులు

పొట్టకూటికోసం వచ్చి... అనంతలోకాలకు

విద్యుదాఘాతంతో లారీ డ్రైవర్ మృతి

కల్లూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పొట్టకూటికోసం వచ్చి ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ లారీ డ్రైవర్ మృతిచెందాడు. ఈ ఘటన పులిచెర్ల మండలం నన్నూరివారిపల్లి పంచాయతీ కుంటావారిపల్లి సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. కల్లూరు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు.. చిత్తూరులోని వైఎస్సార్ నగర్‌కు చెందిన సురేంద్రరెడ్డి (50) లారీ డ్రైవర్. తిరుపతికి చెందిన నారాయణరెడ్డి వద్ద మూడేళ్లుగా డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నారాయణరెడ్డికి చెందిన ఓ లారీ తన భార్య పుట్టినిల్లు అయిన కుంటావారిపల్లిలో స్టార్టింగ్ సమస్యతో పదిరోజులుగా నిలిచి ఉంది. ఆ లారీని బాగుచేసి తీసుకురావడానికి మరో లారీలో ఇద్దరూ కుంటావారిపల్లెకు వెళ్లారు. ఓనర్ డ్రైవింగ్ చేసుకుంటూ వచ్చాడు. గ్రామం ముందు రోడ్డులో లారీని ఆపాడు. తర్వాత ఓనర్ గ్రామంలోకి వెళ్లాడు. ఆ సమయంలో డ్రైవర్ సురేంద్రరెడ్డి లారీలోనే ఉన్నాడు. అటుగా వెళ్తున్న కొందరు లారీని కొంత రోడ్డుకు పక్కగా పెట్టుకోమని చెప్పారు. అప్పటివరకు క్లీనర్ సీటులో ఉన్న డ్రైవర్ లారీని రోడ్డుపక్కగా నిలిపి కిందకు దిగాడు. అప్పటికే లారీ క్యాబిన్ పైన వెళుతున్న 11కేవీ విద్యుత్ లైనుకు ఆనుకుని ఉంది. ఆ విషయం అతడు గమనించలేదు. తర్వాత క్లీనర్ సీటు వద్ద ఉన్న చెప్పులు తీసుకునేందుకు డోరు తీశాడు. అప్పటికే విద్యుత్ సరఫరా అవుతుండడంతో షాక్‌కు గురైన సంఘటనా స్థలంలోనే చనిపోయాడు. కల్లూరు ఎస్‌ఐ ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● తక్కువ ఎత్తులో

విద్యుత్ వైరు ఉండటంతోనే ప్రమాదం

11 కేవీ విద్యుత్ వైరు లారీ క్యాబిన్ తగిలే ఎత్తులో ఉండటంతోనే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. విద్యుత్ శాఖ సిబ్బంది వైర్లు ఎత్తులో ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



లారీ వద్ద విద్యుదాఘాతంతో మృతి చెందిన డ్రైవర్ సురేంద్రరెడ్డి



కుప్పంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆధార్ నమోదు చేస్తున్న సిబ్బంది - స్కూల్‌లో చెట్లకింద తమవంతుకోసం నిరీక్షిస్తున్న చిన్నారులు, పెద్దలు

కిక్కిరిసిన ఆధార్ శిబిరాలు

కుప్పం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కుప్పం మున్సిపాలిటీ పరిధిలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక ఆధార్ శిబిరాలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కిక్కిరిశాయి. కుప్పం లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ఎంఎఫ్‌సీ ప్రభుత్వ జూనియర్ కళాశాల, పరమసముద్రంలోని కస్తూరిబా గాంధీ ప్రభుత్వ బాలికా విద్యాలయాలలో ఆధార్ శిబిరాలు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలదాకా నడిచాయి. అయితే అపార్ కార్డులకోసం ఆధార్ తప్పనిసరి కావడంతో పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులను తీసుకుని ఈ శిబిరాలకు తరలివచ్చారు. ఆధార్ నమోదులో గతంలో చాలా తప్పులు దొర్లడంతో వాటిని సరిచేసుకోవడానికి భారీగా వచ్చారు. ఒక దశలో రద్దీ అధికమై తోపులాటలు చోటు చేసుకున్నాయి. ఈ ప్రత్యేక శిబిరాలు గురువారం కూడా కొనసాగుతాయని, సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు కోరారు.

వీళ్ల డేటా ఇవ్వండి

- టీడీఆర్ బాండ్ల లబ్ధిదారులపై సీఐడీ అనుమానం
- గొల్లవానిగుంట రోడ్డులోనే 32వాటికి డోర్ నెంబర్లు లేని వైనం
- మరో మూడు రోజులు ప్రత్యేక బృందాల విచారణ

తిరుపతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్మెంట్ రైట్స్ (టీడీఆర్) బాండ్లపై సీఐడీ విజిలెన్స్ జరుపుతున్న విచారణలో భాగంగా పలువురు లబ్ధిదారులపై అనుమానం వ్యక్తం చేసింది. గొల్లవాని గుంట మాస్టర్ ప్లాన్ రోడ్డుకు సంబంధించి టీడీఆర్ బాండ్లు పొందినవారిలో 62 మంది వివరాలు కావాలని నగరపాలక సంస్థ అధికారులను సీఐడీ కోరింది. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్లుగా పనిచేసిన పీఎస్ గిరీష మంజూరు చేసిన 34 బాండ్లు, అదేవిధంగా 16 బాండ్లు, 12 బాండ్లు చొప్పున అనుపమ అంజలి, హరిత ఆమోదించిన వివరాల జాబితాపై సీఐడీ దృష్టిపెట్టింది. వీటిలో 32 మంది లబ్ధిదారులకు వారి డోర్ నెంబర్లు కానీ, సమీప డోర్ నెంబర్లు కానీ సదరు జాబితాలో లేకపోవడంపై అధికారులు తలలు పట్టుకుంటున్నట్టు తెలుస్తోంది. డోర్ నెంబరు ఉన్నవాటికి పన్నులు వేశారా? వేసుంటే ఎంత విస్తీర్ణానికి ఎంత వేశారు? అనే కోణంలో వివరాలు సేకరిస్తున్నట్టు సమాచారం.

50 శాతం పూర్తయిన ఇంటింటి విచారణ

టీడీఆర్ బాండ్ల క్షేత్ర స్థాయి విచారణకోసం వివిధ ప్రాంతాలనుంచి తిరుపతికి చేరుకున్న పది మంది అధికారుల బృందం మరో మూడు రోజుల పాటు మాస్టర్ ప్లాన్ రోడ్ల వెంబడి తిరగాల్సి ఉంది. గత మూడు రోజులుగా చేపట్టిన విచారణ 50 శాతం పూర్తయినట్టు తెలిసింది. విచారణలో భాగంగా ప్రతి టీడీఆర్ బాండు లబ్ధిదారుకు సంబంధించి 56 అంశాలపై వివరాణాత్మకంగా నివేదిక సిద్ధం చేసే పనిలో ఉన్నారు.

ఎక్స్‌ప్రెస్ హైవే పనులను పరిశీలించిన జేసీ

బైరెడ్డిపల్లె, డిసెంబరు 11 (ఆంధ్ర జ్యోతి): బైరెడ్డిపల్లెలో జరుగుతున్న ఎక్స్‌ప్రెస్ హైవే పనులను బుధవారం జాయింట్ కలెక్టర్ విద్యాధరి పరిశీలించారు. రోడ్డుపనులు జరుగుతున్న ప్రాంతంలో దుకాణాలు, తాత్కాలికంగా వేసుకున్న షెడ్లను తొలగించి పనులకు ఆటంకం కలగకుండా చూడాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బాధితులు కూడా అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలమనేరు ఆర్డీవో భవాని, తహసీల్దార్ మాధవరాజు, రెవిన్యూసిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జేసీ విద్యాధరి

డీఎస్సీ పరీక్షలకు ఆన్‌లైన్ శిక్షణ

ఏపీ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్

అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వివిధ పాఠశాలల్లో ఉన్న టీచర్ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ నిర్వహించనుంది. ఈ డీఎస్సీ పరీక్షల కోసం బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ విద్యార్థులకు 26 జిల్లాల్లో బీసీ స్టడీ సర్కిల్స్ ద్వారా కోచింగ్ ఇస్తున్నారు. ఇప్పుడు అదనంగా ఆన్‌లైన్ విధానంలో కూడా శిక్షణ ఇవ్వడానికి ప్రభుత్వం సంకల్పించింది. ఈమేరకు ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వగలిగిన కోచింగ్ సంస్థల నుంచి టెండర్లు కూడా పిలిచారు. ఈ నెల 12 నుంచి 20వ తేదీ లోపు ఆన్‌లైన్ విధానంలో టెండర్ వేయాలని ఏపీ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ వీసీ అండ్ ఎండీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బేడా బుడగలను ఎస్సీలలో చేర్చాలి

బుడగ హక్కుల పోరాట సమితి

న్యూఢిల్లీ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): బేడా బుడగ జంగం కులాన్ని ఎస్సీ కులాల జాబితాలో చేర్చాలని కేంద్ర సామాజిక న్యాయ కార్యదర్శి అమిత్‌యాదవ్‌కు బుడగ హక్కుల పోరాట సమితి విజ్ఞప్తి చేసింది. టీడీపీ ఎంపీ లక్ష్మీనారాయణ నేతృత్వంలో బుడగ సంఘం నేతలు ఈమేరకు అమిత్‌యాదవ్‌కు వినతిపత్రం ఇచ్చారు. తమకు ఎస్సీలుగా కుల ధ్రువీకరణపత్రాలు జారీ చేయకపోవడం వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అనర్హులుగా మారుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బేడా బుడగల సమస్యలపై సీఎం చంద్రబాబు గతంలో జేసీ శర్మ కమిషన్‌ను నియమించారని చెప్పారు.

తిరువణ్ణామలైలో గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా నుంచే కాకుండా రాష్ట్రంలోని ఇతర జిల్లాలు, కర్ణాటక రాష్ట్రం నుంచి వేలాది మంది భక్తులు తిరువణ్ణామలైలో గిరి ప్రదక్షిణ (గిరివలం), మహాదీపోత్సవ కార్యక్రమానికి వెళుతుంటారు. జిల్లామీదుగా వెళ్లే భక్తుల రాకపోకలను సులభతరం చేయడం కోసం తిరువణ్ణామలై పోలీసులు భద్రతా ఏర్పాట్లను రూపొందించారు.

● **తాత్కాలిక బస్టాండ్లు:** చిత్తూరు, తిరుపతి నుంచి వేలూరు మీదుగా తిరువణ్ణామలైకి వెళ్లే ఆర్టీసీ బస్సుల కోసం రెండు తాత్కాలిక బస్టాండ్లను ఏర్పాటు చేశారు. తిరువణ్ణామలై దీపంనగర్ జంక్షన్ సమీపంలోని తాయి మూగాంబిక నగర్, ఏకేఎస్ నగర్‌ల వద్ద రెండు బస్టాండ్లను ఏర్పాటు చేశారు. అక్కడ నుంచి తిరువణ్ణామలై నగరానికి ఉచితంగా ప్రైవేటు, ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంటాయి. ● బస్‌స్టాండ్, కారు పార్కింగ్ స్థలాలను తెలుసుకోవాలంటే తిరువణ్ణామలై జిల్లా పోలీసు హెల్ప్‌లైన్ నెంబరు 93636 22330కు వాట్సాప్‌లో హాయ్ లేదా హలో అని పంపితే గూగుల్ మ్యాప్ ద్వారా మార్గదర్శకాలు పొందవచ్చు.

భక్తులకు సూచనలు....

● రోడ్డు పక్కన ఎలాంటి వాహనాలను నిలపకూడదు. కేటాయించిన పార్కింగ్ ప్రదేశాలలో మాత్రమే నిలపాలి. ● భక్తుల క్యూలైన్‌ను అనుసరించి ఆలయ అధికారులకు సహకరించాలి. ● ఆలయ గోపురాల ముందు, గిరివలం మార్గంలో ఎక్కడా కర్పూరం అంటించకూడదు. ● భక్తులు మొబైల్ ఫోన్లు, బంగారు ఆభరణాలను సంరక్షించుకోవాలి. అనుమానాస్పద వ్యక్తులను గమనిస్తే మే ఐ హెల్ప్ యూ బూత్ పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ● గిరివలం మార్గంలో సిలిండర్లతో వంట చేస్తే చర్యలు ఉంటాయి, అటవీ ప్రాంతంలో లోనికి వెళితే శిక్షార్హులవుతారు. ● అత్యవసర పరిస్థితుల్లో తిరువణ్ణామలై టౌన్ క్రైమ్ పోలీసు స్టేషన్ నెంబరు 04175-222303, పోలీసు సూపరింటెండెంట్ కార్యాలయం నెంబరు 94981 00431, జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్ నెంబరు 91596 16263, అత్యవసర సహాయం కోసం 100కు సమాచారం ఇవ్వాలని తిరువణ్ణామలై పోలీసులు సూచించారు.

పీఈఎస్‌కు టాప్ ర్యాంకు

యాదమరి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్కూల్ మెరిట్ అవార్డ్సులో పాఠశాల పనితీరు ఆధారంగా మంగళవారం బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో ఇండియా టాప్ స్కూల్ విన్నర్స్‌ను ప్రకటించారు. ఇందులో భాగంగా 1760 పాఠశాలలను సర్వే చేసి, 15 రకాల పనితీరులను పరిగణలోకి తీసుకొని, 400 సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ పాఠశాలలను ఎంపిక చేశారు. వీటిలో చిత్తూరు జిల్లాకే పీఈఎస్ పబ్లిక్ పాఠశాల మొదటి ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా ఎడ్యుకేషన్ న్యూస్ నెట్వర్క్ సంస్థ చేతుల మీదుగా పీఈఎస్ పబ్లిక్ పాఠశాల ప్రిన్సిపాల్ వై.వి.కృష్ణబాబు అవార్డు అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ మొదటి ర్యాంకు పాఠశాలకు రావడానికి పిల్లల నైపుణ్యం, తల్లిదండ్రుల తోడ్పాటు, ఉపాధ్యాయుల కృషి, యాజమాన్యం సూచనలే కారణమని కొనియాడారు.



పురస్కారం అందుకుంటున్న పీఈఎస్ పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణబాబు

గంజాయి సీజ్ : ముగ్గురి అరెస్టు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): అక్రమంగా గంజాయిని కలిగి ఉన్న ముగ్గురిని ఒకటో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ జయరామయ్య వివరాల మేరకు.. పోలీసులకు వచ్చిన రహస్య సమాచారం మేరకు బుధవారం చామంతిపురం ఎదురుగా గిరింపేట సీటీ రోడ్డుకు చెందిన సుబ్రహ్మణ్యం, వినాయకపురంకు చెందిన ఆటో చిట్టి, గిరింపేట బజారువీధికి చెందిన రాజేష్‌లు అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. ఎస్‌ఐ శ్రీనివాసులు, సిబ్బంది వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారి వద్ద ఉన్న రూ.62వేల విలువ కలిగిన 2.78 కేజీల గంజాయిని సీజ్ చేసి, నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

టీడీపీ ఆర్థికసాయం



శాంతిపురం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలం మల్లూరు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త గోవిందప్ప తల్లి బుధవారం అనారోగ్యంతో మృతిచెందారు. టీడీపీ నాయకులు బాబు, మంజునాథ్, జయరాంరెడ్డి, బయ్యారెడ్డిలు ఆమె మృతదేహానికి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబసభ్యులకు పార్టీ తరఫున రూ.10వేలు ఆర్థికసాయం అందించారు.

సాగునీటి సంఘ ఎన్నికల్లో

టీడీపీ మద్దతుదారులను గెలిపించండి



మాట్లాడుతున్న ఆనందరెడ్డి

రామకుప్పం, డిసెంబరు 11: మండలంలో శనివారం జరిగే సాగునీటి సంఘాల ఎన్నికల్లో టీడీపీ బలపరిచిన అభ్యర్థుల విజయానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఆ పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి. బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు కోరారు. బుధవారం రామకుప్పం పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో వారు సమావేశమై సాగునీటి సంఘాల ఎన్నికలపై సమీక్షించారు. ఈ సమావేశంలో నాయకులు రామ్మూర్తి, శ్రీనివాసులురెడ్డి, జయశంకర్, గంట్లప్పగౌడు, మహ్మద్ రఫీ, వెంకటాచలం, సత్తి, రామలింగారెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, బాలరాజు, సుబ్రీ, బాలరాజు, అల్లీశీన, మంజునాథ్ పాల్గొన్నారు.

కేరళపై కేంద్రం పక్షపాత వైఖరి తగదు



సమావేశంలో మాట్లాడుతున్న వామపక్ష నేతలు

పలమనేరు, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): కేరళపై కేంద్రం పక్షపాతవైఖరి అనుసరిస్తోందని బుధవారం పలమనేరులో వామపక్షనేతలు ఆరోపించారు. పలమనేరులో ఏర్పాటుచేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. కేరళలో అక్కడి ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను, విద్య, వైద్య రంగాల్లో మంచి పాలన అందిస్తోందన్నారు. అయితే అక్కడి ప్రభుత్వానికి కేంద్రం నిధులు విడుదలలో పక్షపాత వైఖరి అనుసరిస్తోందని పేర్కొన్నారు. వయనాడ్ వరదలకు దేశమంతా అండగా ఉన్నా కేంద్రం మాత్రం వారికి తగిన మేర నిధులు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. ఈ సమావేశంలో రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షులు ఓబుల్‌రాజు, నాయకులు గిరిధరగుప్తా, అన్నూరి ఈశ్వర్ భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సమాచారం లేకుండానే రెవెన్యూ సదస్సులు

పెద్దపంజాణి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలలో పేరుకుపోయిన భూసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోంది. అయితే మండలంలో ప్రజలకు సరైన సమాచారం ఇవ్వకుండా ఈ సదస్సులు నిర్వహిస్తున్నారు. ఫలితంగా ప్రజలు తమ సమస్యలు తెలియజేసే అవకాశం కోల్పోతున్నారు. మండలంలో 25 పంచాయతీలకు 22 రెవెన్యూ గ్రామాలున్నాయి. నేటి వరకు చలమంగళం, పెద్దపంజాణి, కోగిలేరు, గంకొండ గ్రామాలలో సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల సమాచారం చాలా మందికి తెలియని పరిస్థితి ఉంది. ఉన్నతాధికారులు స్పందించి రెవెన్యూ సమావేశాల విషయంపై ప్రచారం కల్పించాల్సి ఉంది.

చిరు వ్యాపారులకు గుర్తింపు కార్డులివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంజునాథ్

కుప్పం, డిసెంబరు 11 (ఆంధ్ర జ్యోతి): కుప్పంలోని చిరు వ్యాపారు లకు శాశ్వత గుర్తింపు కార్డులు ఇవ్వాలని చిరు వ్యాపారుల సంఘం అధ్యక్షుడు మంజునాథ్ డిమాండ్ చేశారు. కుప్పంలోని కమ్యూనిటీ హాలులో బుధవారం చిరు వ్యాపారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో వ్యాపారం చేస్తున్న చిరు వ్యాపా రస్తులకు శాశ్వత గుర్తింపు కార్డులు ఇవ్వడమే కాకుండా, మెప్మా ద్వారా రుణ సదుపాయం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపాలిటీ పరిధిలోని చిరు వ్యాపారస్తులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయండి



చౌడేపల్లె, డిసెంబరు11: జనవరి 5 విజయవాడలో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వ ర్యంలో జరిగే హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం సభ్యులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ ఆవ రణలో వీహెచ్‌పీ సభ్యులతో నిర్వ హించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆలయాల అభివృద్ధి, హిందువుల భద్రత తదితర అంశాలపై జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు.

జూనియర్ కళాశాల ఆకస్మిక తనిఖీ



మెటీరియల్‌ను అందజేస్తున్న సయ్యద్‌మౌల

గుడుపల్లె, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లా వృత్తి విద్యాధికారి సయ్యద్‌మౌలా బుధవారం గుడుపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సంకల్ప. విద్యాశక్తి కార్యక్రమాల తీరును ఆయన సమీక్షించారు. అనంతరం సంకల్ప కార్యక్రమంలో భాగంగా ఆయన విద్యార్థులకు ప్రశ్న, జవాబులతో కూడిన స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామకృష్ణమనాయుడు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నీటి సంఘ ఎన్నికలకు బందోబస్తు

పుంగనూరు రూరల్, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): నీటి సంఘ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దార్, ఇరిగేషన్, మండల పరిషత్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికలు నిర్వహించే చెరువుల వివరాలను అందజేయాలని కోరారు. ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో ఎలాంటి ఘర్షణలు జరగకుండా ముందస్తుగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాము, ఇరిగేషన్ జేఈ రాజేంద్రబాబు, ఏవో రెడ్డెమ్మ తదితరులు పాల్గొన్నారు.

విలేకరులకు క్షమాపణ చెప్పాలి

పలమనేరు, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో మంగళవారం విలేకరులపై సినీ నటుడు మోహన్‌బాబు చేసిన దాడిని పలమనేరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.లక్ష్మీపతి, బార్ అసోసి యేషన్ సభ్యులు తీవ్రంగా ఖండించారు. బుధవారం వారు మాట్లాడుతూ గాయపడిన వారికి మోహన్‌బాబు, ఆయన కుటుంబ సభ్యులు క్షమాపణలు చెప్పడంతో పాటు వారి వైద్య ఖర్చులు భరించాలని కోరారు.

రేపు రైతులకు మద్దతుగా వైసీపీ నిరసన

పలమనేరు, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో టీడీపీ కూటమి రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఈ నెల 13న కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టనున్నట్లు వైసీపీ నాయకులు తెలియజేశారు. ఈ మేరకు స్థానిక వైసీపీ కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు.

భక్తిశ్రద్ధలతో గీతాపారాయణం

బైరెడ్డిపల్లె, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లెలో వున్న వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో బుధవారం గీతాపారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గీతాజయంతి సందర్భంగా పలువురు మహిళలు ఆలయప్రాంగణంలో భగవద్గీతను పారాయణం చేశారు. వాసవీ ఫౌండేషన్ వారు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రైతులకు అండగా ప్రభుత్వం

రామకుప్పం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కళ్యాణ్‌ల ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని రైతులకు అండగా నిలుస్తోందని టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణ, తెలుగురైతు నియోజకవర్గ, మండల అధ్యక్షుడు చలపతి, కొళ్లపల్లెబాబులు తెలిపారు. బుధవారం రామకుప్పం మండలం కొంగనపల్లె గ్రామంలో జరిగిన రెవిన్యూ సదస్సుల్లో వారు మాట్లాడారు. అనంతరం తహసీల్దారు బాబు ప్రజల నుంచి వినతిపత్రాలు అందజేశారు. నాయకులు మునస్వామిశెట్టి, పెద్దకృష్ణ, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల



రామకుప్పం, డిసెంబరు 11: రామకుప్పం మండలంలోని ఏడు సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు అధికారులు బుధవారం నోటిఫికేషన్లను విడుదల చేశారు. రామకుప్పం పెద్దచెరువు, ఆవులకుప్పం పెద్దచెరువు, ఎస్.గొల్లపల్లె చెరువు, విజలాపురంపెద్దచెరువు, కెంచనబల్ల తోట్లచెరువు, సాకలకుప్పం పెద్దచెరువు, సింగసముద్రం పెద్దచెరువులకు సంబంధించి ఆయా గ్రామాల్లో ఎన్నికల అధికారులు నోటిఫికేషన్లను విడుదల చేశారని ఇరిగేషన్ ఏఈ వెంకటప్రసాద్ తెలిపారు.

రెవెన్యూ సదస్సులతో రైతుల కష్టాలు దూరం



మాట్లాడుతున్న విశ్వనాథనాయుడు

శాంతిపురం, డిసెంబరు 11: రెవెన్యూ సదస్సులతో రైతుల కష్టాలు దూరమవుతాయని టీడీపీ శాంతిపురం మండల అధ్యక్షుడు విశ్వనాథనాయుడు. ప్రధానకార్యదర్శి నాగరాజులు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని శివరామపురంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వారు మాట్లాడారు. అనంతరం తహసీల్దారు శివయ్య ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. టీడీపీ నాయకులు ఏఎంసీనాగరాజు, రయేష్, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఆగని విద్యుత్ మోటార్ల చోరీలు

పెద్దపంజాణి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పెద్దపంజాణి మండల కేంద్రంలో విద్యుత్ మోటార్ల చోరీలు ఆగడం లేదు. వారం క్రితం నరసింహారెడ్డి అనే రైతుకు చెందిన ఒక వ్యవసాయ మోటారు చోరీకి గురైంది. మంగళవారం రాత్రి సుబ్రమణ్యం రెడ్డికి చెందిన రెండు 5 హెచ్‌పి మోటార్లు చోరీకి గురయ్యాయి. వరుస చోరీలతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మేలైన పశు సంపదతో ఆర్థికాభివృద్ధి



పాడిరైతులకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ ప్రభాకర్

సోమల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మేలైన పశుసంపదతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ ప్రభాకర్ తెలిపారు. బుధవారం ఆవులపల్లెలో పేయదూడల ప్రదర్శనను అధికారులు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కృత్రిమ గర్భధారణ పద్ధతిలో సాధారణ వీర్య నాళికలను ఉపయోగించడం ద్వారా సగం మగ, సగం ఆడ నిష్పత్తిలో దూడలు పుడుతా యన్నారు. నూతన విధానం ద్వారా 90శాతం పెయ్య దూడలే పుడుతాయని తెలియ జేశారు. సబ్సిడీపై రెండు ఎదసూదులు వేస్తామని వివరించారు. ఇందుకోసం రూ.1350 గాను రూ.500 రైతులు చెల్లించాలని తెలిపారు. రెండు ఎదసూదులు నిలవని పక్షంలో రైతుకు తిరిగి రూ.500 చెల్లిస్తామని పేర్కొన్నారు. సోమల మండలంలో 95 పెయ్య దూడలు పుట్టడంతో జిల్లాలో మొదటిస్థానంలో నిలిచిందన్నారు. పలువురు రైతులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసంచాలకులు డాక్టర్ బాల సుబ్రమణ్యం, డాక్టర్ శ్రీనివాసులునాయుడు, డాక్టర్ వాసు, పశువైద్యాధికారులు చందన ప్రియ, శ్రీధర్, ప్రదీప్, తబ్రౌజ్ బాషా, సర్పంచు కోదండరాజు, మాజీ సర్పంచు రెడ్డెమ్మ, వేణుగోపాల్ నాయుడు, లక్ష్మీపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డుకు భూమి పూజ

కుప్పం రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లానూరు నడువులప్ప కొట్టాలుకు సీసీ రోడ్డు నిర్మాణానికి బుధవారం టీడీపీ కుప్పం మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు మళ్లీ ముఖ్యమంత్రి కావడంతో కుప్పం నియోజకవర్గానికి పట్టిన శని వదిలి అన్ని గ్రామాలు అభివృద్ధితో కళకళలాడుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జి రామచంద్ర, యూనిట్ ఇన్‌చార్జిలు రమేశ్, దామోదర్, మోహన్, పంచాయతీ పార్టీ అధ్యక్షుడు రమేశ్, బూత్ ఇన్‌చార్జిలు, ఇతర నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో సమన్వయం చేసుకోవాలి



మాట్లాడుతున్న దళిత నాయకులు

కుప్పం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అధికారులతో కలసి సమన్వయం చేసుకుని పనిచేస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని దళిత నాయకులు మునస్వామి, నవీన్ అన్నారు. ఆర్డీవో శ్రీనివాస రాజు తమను పిలువకుండానే ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించినందుకు నిరసనగా మంగళవారం ఒక వర్గానికి చెందిన దళిత నాయకులు కొంతమంది అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆందోళన చేసిన విషయం తెలిసిందే. దీనికి ప్రతిగా బుధవారం మరో వర్గానికి చెందిన దళిత నాయకులు అంబేద్కర్ విగ్రహం వద్ద వారి తీరుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంగళవారం జరిగింది ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సమావేశం కాదన్నారు. ఆ సమావేశం ఎలా ఎప్పుడు నిర్వహించాలన్న అంశంపైనే ఆర్డీవో డివిజనల్ మానిటరింగ్ కమిటీ సభ్యులతో చర్చించారన్నారు. అలాగే స్థానికంగా దళితుల అభ్యున్నతికి చేపట్టాల్సిన చర్యల గురించి కూడా సమావేశంలో చర్చకు వచ్చిందన్నారు. దీన్ని తప్పుగా అర్థం చేసుకున్న కొంతమంది దళిత నాయకులు నిరన తెలిపి, తప్పుడు ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు దళిత నాయకులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు మంచి స్పందన



అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ రాము

పుంగనూరు, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తున్నట్లు తహసీల్దార్ రాము తెలిపారు. బుధవారం మండలంలోని పాళ్యంపల్లె సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వారసత్వ హక్కులు కల్పించాలని, సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని, రేషన్ కార్డులు మంజూరు చేయాలని, ఇళ్ల పట్టాలు ఇవ్వాలని వినతులు సమర్పించారు. దాదాపు 19 సమస్యలు రాగా అందులో 3 సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించినట్లు తహసీల్దార్ వివరించారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణానాయక్, సర్వేయర్ శ్రీనివాసులునాయక్, నాయకులు బాబునాయక్, రామకృష్ణనాయక్, బాలాజీనాయక్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువత ఆత్మ విశ్వాసంతో ముందుకెళ్లాలి

పుంగనూరు, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): యువత ఆత్మ విశ్వాసంతో ముందుకెళ్లాలని అప్పుడే ఉన్నత స్థానాలకు వెళ్లగలరని వేద పండితులు శ్రీరామనాథశర్మ పేర్కొన్నారు. బుధవారం స్థానిక పుంగమ్మ కట్టపై గల త్యాగరాజస్వామి ఆలయంలో గీతా జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. యువత భగవద్గీత వినడం వల్ల వినయం, విధేయత, క్రమశిక్షణ అలవడుతాయని పేర్కొన్నారు. విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకటపతి మాట్లాడుతూ యువత ఉత్సాహం, సాహసం, ధైర్యం, పరాక్రమం, పెద్దల పట్ల గౌరవం వంటి సుగుణములను అలవరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయిబ్రాహ్మణచైతన్య శక్తి అధ్యక్షుడు వెంకటేశ్, నాగరాజు పాల్గొన్నారు.

శెట్టిపేట రెవెన్యూ సదస్సుకు 36 అర్జీలు



రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అధికారులు

చౌడేపల్లె, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): శెట్టిపేట రెవెన్యూ సదస్సుకు 36 అర్జీలు వచ్చినట్లు డీటీ మాధవి పేర్కొన్నారు. గురువారం మండలంలోని శెట్టిపేట సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ టీడీపీ ఇన్ చార్జి వెంకటరమణరాజు, నాయకులు మాదిరాజు లక్ష్మీపతిరాజు, ప్రదీప్‌రాజు, నారాయణరాజు, శివశంకర్‌రాజు, ఆర్‌ఐ భారతి, వీఆర్‌వోలు, రైతులు పాల్గొన్నారు.

బాలసుబ్రహ్మణ్య స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న కడ పీడీ తదితరులు

కుప్పం రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం చెక్కునత్తం పంచాయతీ కూసూరు అటవీ ప్రాంతంలో నెలకొన్న బాలసుబ్రహ్మణ్యస్వామివారి ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని కడా పీడీ వికాస్ మర్మత్ హామీ ఇచ్చారు. ఆయన బుధవారం స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ అధ్యక్షుడు సత్యేంద్రశేఖర్, మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేశ్, టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జి మహేంద్రబాబు, చెక్కునత్తం మణి, మురళి, సంతోశ్, వళ్లెప్ప, కనకరాజు, సుందర్, మనోహర్, యతిరాజు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో సమస్యల పరిష్కారం

సోమల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులతో రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని మాజీ వైస్‌ఎంపీపీ ఉమాపతినాయుడు తెలిపారు. బుధవారం పెద్దఉప్పరపల్లెలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ బెన్నిరాజ్ పలువురి నుంచి వినతులు స్వీకరించారు. క్షేత్రస్థాయిలో సర్వే చేయించారు. శ్మశాన భూములకు దారి సౌకర్యాలపై రైతులతో సమీక్షించారు. ఈ సమావేశంలో సర్పంచుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు యదుశేఖర్ నాయుడు, ఆర్‌ఐ సుబుక్తుల్లా రైతులు పాల్గొన్నారు.

సోమలలో చిరుజల్లులు

సోమల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో బుధ వారం సోమలలో మధ్యాహ్నం కొద్దిసేపు చిరుజల్లులు కురిశాయి. దీంతో వరి కోతలు చేస్తున్న రైతులు, బండలపై వరి ధాన్యాలు నిల్వ చేసిన రైతులు ఇబ్బంది పడ్డారు. టమోటా కోతలు ఆపే శారు. వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో టమోటా తోటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

క్యాంపస్ సెలక్షన్స్‌లో 19 మంది ఎంపిక



పుంగనూరు రూరల్, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): యువతకు జీవనోపాధి కల్పించడమే డీఆర్‌డీఏ లక్ష్యమని స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఐటీఐ కళాశాల ఆవరణలో వివిధ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. 43 మంది హాజరు కాగా 19 మందిని ఎంపిక చేసుకున్నాయి. వారికి నియామక పత్రాలు అందజేశారు.

పొదలకుంటపల్లెలో పారిశుధ్య పనులు

సోమల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం పొదలకుంటపల్లెలో కార్యదర్శి షేక్ ఫయాజ్ బుధవారం పారిశుధ్య పనులు చేయించారు. సచివాలయం, పంచాయతీ కార్యాలయం, రైతు సేవాకేంద్రా వద్ద ముళ్లపొదలు, నీటి నిల్వ గుంతలను పూడ్చించారు. ఈవోపీఆర్డీ లక్ష్మీదేవి పర్యవేక్షించారు.

మామిడి, టమోటా పంటలకు బీమా చేసుకోండి

సోమల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సోమల మండలం పరిధిలోని మామిడి, టమోటా సాగు చేసిన రైతులు పంటల బీమా చేయించుకోవాలని ఉద్యానాధికారి సంతోష్‌కుమారి తెలిపారు. మామిడి ఎకరాకు రూ.1750 ప్రీమియం చెల్లిస్తే నష్టం జరిగితే రూ.35,000 వస్తుందన్నారు. టమోటా ఎకరాకు రూ.1250 ప్రీమియం చెల్లిస్తే పంట నష్టం జరిగితే రూ.25,000 మంజూర వుతుందని వివరించారు. ఈ నెల 15వ తేదీలోపు మామిడి రైతులు బీమా చేసుకోవాల్సి ఉంటుందని తెలియజేశారు. మరిన్ని వివరాలకు స్థానిక రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని కోరారు.

సుబ్రమణ్యేశ్వరుడుకి తులాభారం

కల్లూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం 102 ఈ. రామిరెడ్డిగారిపల్లి పంచాయతీ ఎలకబైలులో కొలువైన సుబ్రమణ్యేశ్వరస్వామికి బుధవారం సదుం మండలానికి చెందిన భక్తులు సూర్య నారాయణరెడ్డి, సాహిత్య దంపతులు రూ.36వేలు నగదు రూపంలో తులాభారం సమర్పించారు. ఏడాది వయసున్న తన కుమారుడు తుష్యంత్ ఆర్యన్‌రెడ్డికి తులాభారం వేశారు. అర్చకులు వెంకటేశ్వర్లు స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించి వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.

లోపించిన పారిశుధ్యం

పుంగనూరు రూరల్, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో వీధుల్లో మురుగునీరు ప్రవహిస్తోంది. తాగునీటి బోర్ల వద్ద మురుగునీరు నిల్వ చేరింది. మురుగు కాల్వల్లోనే తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేయడంతో తాగునీరు కలుషితమవుతోంది. ఆ నీరు తాగి జనం అంటురోగాల బారిన పడుతున్నారు. మండలంలోని పూజగానిపల్లె, చెర్లోపల్లె, కుమ్మరగుంట, అమ్మిగానిపల్లె, అలజనేరు గ్రామాల్లో పారిశుధ్యం మరీ అధ్వానంగా ఉంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి గ్రామాల్లో కాల్వల్లో ఏర్పాటు చేసిన కొళాయిలు మార్పు చేసి, పారిశుధ్య పనులు చేపట్టాలని, మురుగునీరు వీధుల్లో ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పూజగానిపల్లె ప్రభుత్వ పాఠశాల పక్కనే ప్రవహిస్తున్న మురుగునీరు, తాగునీటి పైపు వద్ద నిల్వ ఉన్న మురుగునీరు, కుమ్మరగుంటలో మురుగుకాల్వలో ఏర్పాటు చేసిన తాగునీటి కొళాయిలు, అలజనేరులో వృథాగా పోతున్న తాగునీరు

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

రూ. 29.21 లక్షలతో ఆరు బోర్లు ప్రారంభం

● అందుబాటులోకి రూ.1.20 కోట్ల స్వీపింగ్ వాహనం



స్వీపింగ్ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్, కమిషనర్

చిత్తూరు అర్బన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. బుధవారం నగరంలోని ఆరు ప్రాంతాల్లో వేసిన రూ.29.21 లక్షల విలువైన బోర్లను, రూ.1.20 కోట్ల విలువైన పెద్ద స్వీపింగ్ వాహనాన్ని ఎమ్మెల్యే, కమిషనర్ నరసింహప్రసాద్, ఇతర ప్రజాప్రతినిధులు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో నీటి సమస్యను పరిష్కరించామన్నారు. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు పెద్ద స్వీపింగ్ యంత్రాలను తెప్పించామని, వీటిద్వారా పెద్ద రోడ్లను వేగంగా శుభ్రం చేయవచ్చన్నారు. పలు ప్రాంతాల్లో బోరు, మోటార్లను ప్రారంభించిన ఎమ్మెల్యేను స్థానికులు ఘనంగా సన్మానించారు. మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, ఇతర అధికారులు, కార్పొరేటర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించండి

● ఆర్డీవో శ్రీనివాసులు



చిత్తూరు రూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చే అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు తహసీల్దార్లను ఆదేశించారు. బుధవారం చిత్తూరు ఆర్డీవో కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 31వ తేది వరకు జరిగే రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటున్నందున సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని చెప్పారు. రీసర్వే తప్పులను సరిదిద్దుకునేందుకు నిర్వహించిన గ్రామ సభల్లో చిత్తూరు డివిజన్ పరిధిలో 1200 అర్జీలు వచ్చాయన్నారు. వాటిలో 300 పరిష్కరించామని, మరో వంద అర్జీలు పరిష్కారదశలో ఉన్నాయన్నారు. మిగిలిన వాటిని కూడా అధికారులు విచారణ చేస్తున్నారని ఆయన తెలిపారు.

రైతు ద్రోహి జగన్: టీడీపీ

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రైతు ద్రోహి జగన్మోహన్‌రెడ్డి ఏ ముఖం పెట్టుకుని కలెక్టర్ కార్యాలయాల ముందు నిరసనలు చేపడతారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్ ఎద్దేవా చేశారు. బుధవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందంటూ శుక్రవారం కలెక్టర్ కార్యాలయాల ముందు నిరసనలు వ్యక్తం చేసే నైతిక హక్కు మాజీ సీఎం జగన్‌తో పాటు వైసీపీ నాయకులకు లేదన్నారు. రీసర్వేల పేరుతో డ్రోన్ కెమెరాల ద్వారా తప్పుడు కొలతలు, పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. అధికారం కోల్పోయాక రైతులపై ప్రేమను చూపిస్తూ నిరసనలతో పార్టీ ఉనికిని చాటుకోవాలని చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. మీడియా సమావేశంలో టీడీపీ నాయకులు మోహన్‌రాజ్, గోపాల్, ధరణి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి చేయూత



నివాళులర్పిస్తున్న శ్రీధర్, కవిత, హరీష్

గంగాధరనెల్లూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోతరంగనపల్లె గ్రామానికి చెందిన గోవిందమందడి కుమారుడు గజేంద్ర యాదవ్ ఈనెల 1వ తేదిన నెల్లేపల్లె సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. గంగాధరనెల్లూరు మండలం మోతరంగనపల్లె గ్రామంలో బుధవారం జరిగిన గజేంద్ర యాదవ్ కర్మక్రియల్లో జిల్లా టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, జిల్లా అఖిల భారతీయ యాదవ సంఘం అధ్యక్షురాలు కవిత సురేష్ యాదవ్, ప్రధానకార్యదర్శి నవీన్ యాదవ్, జ్యోతి యాదవ్, హరీష్ యాదవ్, సర్పంచ్ సుబ్రమణ్యం యాదవ్‌లు పాల్గొని, ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం అఖిల భారతీయ యాదవ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు అన్నా రామచంద్రయాదవ్ సూచన మేరకు యాదవ సంఘం తరపున రూ.1,50,500లను ఫిక్సెడ్ డిపాజిట్ పాసుపుస్తకాన్ని వారు గజేంద్ర సతీమణి తనూజకు అందజేశారు. కార్యక్రమంలో యాదవ సంఘం నేతలు ప్రతిభయాదవ్, కృష్ణమూర్తియాదవ్, నాగయ్యయాదవ్, వాసుయాదవ్, అశోక్‌యాదవ్, గోవర్ధన్ యాదవ్‌లు పాల్గొన్నారు.

కిశోర బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది



ప్రసంగిస్తున్న స్త్రీశిశు సంక్షేమశాఖ పీడీ హైమావతి

నగరి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): కిశోర వికాస కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని జిల్లా స్త్రీసంక్షేమ శాఖ పీడీ హైమావతి పేర్కొన్నారు. బుధవారం నగరి ఐసీడీఎస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 11-18 ఏళ్ల బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబన మెరుగుపరచడం ఈ కార్యక్రమ లక్ష్యమని వివరించారు. కార్యక్రమంలో సీడీపీవో కృష్ణవేణి, డాక్టర్ సుస్మిత, ఎంపీడీవో సతీష్, నోడల్ అధికారి జయంతి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలు, బాల్య వివాహాలపై అవగాహన

పెనుమూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): బాలికలకు సైబర్ నేరాలు, బాల్య వివాహాలపై అవగాహన కల్పించే బాధ్యత అందరిపై ఉందని మెడికల్ ఆఫీసర్ హర్షవర్ధన్ పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో కిశోర వికాసం మండల స్థాయి శిక్షణా కార్యక్రమం జరిగింది. కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని, పోక్సో చట్టం తదితర అంశాలపై అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి అవగాహన కల్పించారు. బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో యోగా ఆవశ్యకతను తెలిపారు. పరంధామయ్య ఆధ్వర్యంలో బాలికలచే కరాటే ప్రదర్శించారు. ఎంఈవో రాజేంద్ర, ఇవోపీఆర్డీ మహేశ్వర్‌రెడ్డి, ఏపీఎం చిరంజీవి, వైద్యాధికారులు రేణుక, ఎంఎల్‌హెచ్‌పీలు కీర్తిప్రియ, రూప, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



చిత్తూరు కల్చరల్, డిసెబరు 11 (ఆంధ్రజ్యోతి): గిరింపేట గంగినేని చెరువు వీరభద్ర ఆలయం కుంభాభిషేక మూడవ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం జంగమ కులస్థులు అన్నదానం చేశారు. స్థానిక పొన్నియమ్మ గుడివీధి ఆటో స్టాండ్ వద్ద మాజీ ఎమ్మెల్యే సి.కె.బాబు తన అనుచరులతో కలిసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో సురేష్, అన్నపూర్ణ, దుర్గ, గిరింపేట శీను, మురళి, జంగమ, రజక కులస్థులు పాల్గొన్నారు.

వేలం వాయిదా

చిత్తూరు అర్బన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): నగరపాలక పరిధిలో ప్రధాన కూరగాయల మార్కెట్‌కు నిర్వహించిన వేలం పాట వాయిదా పడింది. కూరగాయల మార్కెట్, ఎన్టీయార్ నగరపాలక బస్టాండ్, జంతువధశాల గుత్త వసూలుకు రెవెన్యూ విభాగం అధికారులు వేలంపాట నిర్వహించారు. వేలం పాటకు ఒకే వ్యక్తి హాజరుకావడంతో వాయిదా వేశారు.

పారిశుధ్య కార్మికులకు గ్లవ్స్, షూస్ పంపిణీ



నగరి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరి పట్టణ పరిధిలోని పీఎంపీ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు షూస్, గ్లవ్స్‌ను ఎమ్మెల్యే భానుప్రకాష్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. బుధవారం పట్టణంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజల ఆరోగ్యానికి పాటుపడుతున్న పారిశుధ్య కార్మికులకు ఈ వస్తువులు అందించడం అభినందనీయమన్నారు. పీఎంపీ డాక్టర్లు జెన్నత్, భక్తవత్సలం, గుణశేఖర్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, దేశమ్మ ఆలయ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు రమేష్‌బాబు, నాయకులు గుణశేఖర్ పాల్గొన్నారు.

ముగ్గురికి టీడీపీ జీవితకాల సభ్యత్వం



టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్న ముగ్గురు నాయకులతో భీమినేని చిట్టిబాబు నాయుడు

పాలసముద్రం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలకృష్ణాపురం గ్రామానికి చెందిన జి.కోదండ నాయుడు, కె.భాస్కర నాయుడు, జి.చంద్రశేఖర నాయుడు బుధవారం పాలసముద్రంలో రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబు నాయుడు సమక్షంలో ఒక్కొక్కరు లక్ష రూపాయలు చెల్లించి జీవితకాల టీడీపీ సభ్యత్వాన్ని తీసుకున్నారు. వీరిని భీమినేని శాలువా కప్పి సన్మానించారు. మండలంలో ఇప్పటి వరకు 17 మంది జీవితకాల సభ్యత్వం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శేఖర్‌రాజు, రవి నాయుడు, వెంకటేశులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూలను సమర్థవంతంగా ఎదుర్కోవాలి

విజయపురం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఇంటర్వ్యూలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని స్కిల్ ఇండియా శిక్షకులు, నింద్ర మండల ఎంఈవో శ్రీధర్‌రాజు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మాధవరం ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంటుపై అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ లలిత, అధ్యాపకులు అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీరకనెల్లూరులో కొత్తబోరు డ్రిల్లింగ్

గంగాధరనెల్లూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరకనెల్లూరులో కొత్తగా వేస్తున్న బోరు డ్రిల్లింగ్‌ను ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను గ్రామస్థులు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన కొత్తబోరు వేసి సమస్యను పరిష్కరించాలని ఎంపీడీవోను ఆదేశించారు. ఈ క్రమంలో వీరకనెల్లూరులో బుధవారం కొత్తగా బోరు డ్రిల్లింగ్ చేస్తుండగా, సమృద్ధిగా నీళ్లు రావడంతో గ్రామస్థులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.

ఎండీయూ వాహనంపై జగన్ బొమ్మ తొలగింపు



శ్రీరంగ రాజపురం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకులు పంపిణీ చేసే ఎండీయూ వాహనంపై మాజీ సీఎం జగన్ బొమ్మను రెవెన్యూ అధికారులు ఎట్టకేలకు తొలగించారు. ఎస్ఆర్ పురం మండలం శెట్టివానత్తం గ్రామంలో ఎండీ యూ వాహనంపై జగన్ బొమ్మను తొలగించకపోవడంపై మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి తహసీల్దార్ లోకనాథం పిళ్లై స్పందించారు. బుధవారం సాయంత్రానికంతా జగన్ బొమ్మను తొలగించారు.

అందుబాటులో ఆయుర్వేద వైద్య సేవలు

● ఎంపీ దగ్గుమళ్ల

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద వైద్య సేవలను ప్రజలకు అందుబాటులో తీసుకురానున్నట్లు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఆయుర్వేద వైద్య (ఆయుష్మాన్) సేవలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందించడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికే అర్బన్ హెల్త్ సెంటర్లలో వైద్య సేవలు అందిస్తున్నట్లు గుర్తు చేశారు.

కార్వేటినగరం గంగ జాతరకు చాటింపు

వెదురుకుప్పం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలో ఈ నెల 17, 18 తేదీలో జరిగే గంగ జాతరకు బుధవారం చాటింపు చేశారు. గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి సుబ్రహ్మణ్యంరాజు బృందం వేసిన తోటి వేషం అలరించింది.

కృష్ణాపురం జలాశయం గేటు ఎత్తివేత

వెదురుకుప్పం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కృష్ణాపురం జలాశయం గేటును బుధవారం రాత్రి నీటిపారుదలశాఖ అధికారులు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఇటీవల తుపాను కారణంగా చెరువులకు చేరిన నీరు కలుజు పారడం, వాగులు, వంకల ప్రవాహంతో కృష్ణాపురం జలాశయానికి చేరింది. దీంతో బుధవారం రాత్రి అధికార యంత్రాంగం గేటు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు.

శ్మశానానికి దారి పరిశీలన

గుడిపాల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామభద్రాపురం దళితవాడ, చుక్కావారిపల్లె గ్రామాల్లో శ్మశానానికి దారి లేకపోవడంతో గ్రామస్థుల ఫిర్యాదు మేరకు బుధవారం తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి ఆయా గ్రామాలను సందర్శించి, దారిని పరిశీలించారు. గ్రామస్థులు మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా శ్మశానానికి దారి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. త్వరలోనే పరిష్కరిస్తామని తహసీల్దార్ హామీయిచ్చారు. సర్వేయర్లు గోపినాథ్, కోటేశ్వరరావు, పళని, మోహన్, వీఆర్వోలు పాల్గొన్నారు.

అపరిశుభ్రతకు కేరాఫ్ మీరాసాహెబ్‌పాళెం

● పట్టించుకోని పంచాయతీ అధికారులు

● మురుగులో మాజీ మంత్రి రోజా దత్తత గ్రామం



చెరువును తలపిస్తున్న మురుగునీరు





మీరాసాహెబ్‌పాళెంలో డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తాచెదారం, ప్లాస్టిక్ బాటిళ్లు

నగరి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): అపరిశుభ్రతకు కేరాఫ్ మీరాసాహెబ్‌పాళెం అనడంలో అతిశయోక్తి లేదు. గ్రామం పూర్తిగా మురుగునీటి మయంగా, చెత్తాచెదారం పేరుకుపోయి ఉన్నా పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడం విచారకరం. 150 కుటుంబాల ముస్లింలు నివాసమున్న నగరి మండలంలోని మీరాసాహెబ్‌పాళెంలో మురుగు కాలువలను శుభ్రం చేసిన దాఖలాల్లేవు. 10 సంవత్సరాల క్రితం మురుగు కాలువలు నిర్మించారే గాని నీరు వెలుపలికి పోయే మార్గం ఏర్పాటు చేయకపోవడంతో ప్లాస్టిక్‌సీసాలు, చెత్తా చెదారానికి నిలయాలుగా మారాయి. గ్రామస్థులంతా పాతవస్తువుల వ్యాపారం చేసేవారే. గ్రామంలోకి ప్రవేశించే మార్గంలో మురుగునీరు పాచిపట్టి దోమలకు ఆవాసంగా మారింది. చెత్తా చెదారం పేరుకుపోయినా తొలగించే నాథుడే లేడని గ్రామస్థులు వాపోతున్నారు.

నూతన కాలువ నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం

దోమల నివారణకు తాత్కాలికంగా ఫాగింగ్ చేశాం. గ్రామంలోని మురుగు నీరు వెలుపలికి వెళ్లడానికి శాశ్వత పరిష్కారం కోసం డ్రైనేజీ నిర్మించాలి. పట్టా భూమి కావడంతో ఆ రైతు అంగీకరిస్తే నూతన కాలువ నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

- అరుణ, ఈవోపీఆర్డీ

రాత్రుళ్లు నిద్రపోలేక పోతున్నాం



దోమలు విపరీతంగా ఉండటంతో రాత్రుళ్లు నిద్రపోలేక పోతున్నాం. జ్వరాలకు గురై చిన్నారులు నానా తిప్పలు పడుతున్నారు. మురుగు నీరు నిల్వ లేకుండా చేయాలి.

- నూర్జహాన్‌బేగం

చెత్త తొలగించడం లేదు



దోమలు అధికంగా వున్నాయి. గ్రామంలో డ్రైనేజీలు శుభ్రం చేయడం లేదు. చెత్తను తొలగించడం లేదు. మురుగునీరు, చెత్తా చెదారం నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తోంది. చర్మవ్యాధులు వస్తున్నాయి.

- ఫరీదాబేగం

భూసమస్యలు లేని గ్రామాలే లక్ష్యం

● ఎమ్మెల్యే మురళీ మోహన్



రాగిమానిపెంట రోడ్డు వద్ద తారురోడ్డుకు భూమి పూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు

బంగారుపాళ్యం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): భూసమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. బుధవారం నలగాంపల్లెలో జరిగిన గ్రామసభలో ఆయన పాల్గొని గ్రామస్థుల నుంచి అర్జీలను స్వీకరించారు. రైతులకు సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకాల్లో ఏమైనా తప్పిదాలున్నా, సర్వేలో భూమి నష్టపోయిన రైతులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తారని హామీయిచ్చారు. 35 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు జయప్రకాష్, ఎంపీటీసీ ప్రసన్నకుమారి, నాయకులు జయచంద్ర నాయుడు, సర్పంచ్ షీబా స్వామిదాస్, ఎన్‌పీ ధరణి, జనార్దన్ గౌడ్, కోకా ప్రకాష్ నాయుడు, నాగరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తారురోడ్డుకు భూమిపూజ

రాగిమానిపెంట రోడ్డు నుంచి డేగలబంద, బి.ఎల్. కండ్రిగ, చంద్రశేఖరపురం గ్రామాలను కలుపుతూ సుమారు ఐదు కిలోమీటర్ల మేర తారురోడ్డు నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే మురళీమోహన్, మండలపార్టీ అధ్యక్షుడు ఎన్.పీ. జయప్రకాష్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వరల్డ్ బ్యాంక్ నిధులతో ఆంధ్రప్రదేశ్ రూరల్ రోడ్డు ప్రాజెక్ట్ ద్వారా ఈ తారు రోడ్డు నిర్మాణానికి రూ.4.50 కోట్లు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. నాయకులు ఎన్‌పీ ధరణి, నాగరాజ నాయుడు, జయ, బాలక్రిష్ణమ నాయుడు, లోక, ఈఈ నాగరాజ్, డీఈ ప్రసాద్, ఎంపీడీవో శ్రీధర్, పీఆర్ ఏఈ గోవర్ధన కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

తవణంపల్లె, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు డీటీ వెంకటరమణ తెలిపారు. మండలంలోని మత్యం మొట్టుకూరులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో డీటీకి మ్యుటేషన్‌కు నలుగురు, దురాక్రమణకు సంబంధించి ఒకరు, దారి సమస్యపై ఒకరు అర్జీలు ఇచ్చారు. ఆర్ఐ జీవన్ సాగర్, సర్వేయర్ మురళీకృష్ణ, వీఆర్వో ప్రకాష్, రెవన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గుడిపాల: మండలంలోని రామభద్రాపురం, 190రామాపురంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 33 అర్జీలు అందాయని తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి హేమాద్రి నాయుడు, గుడిపాల ఎంపీటీసీ గోళ్ల హరిప్రసాద్ చౌదరి, సర్వేయర్లు గోపీనాథ్, కోటేశ్వరరావు, వీఆర్వో శోభన్, ఆర్ఐ రామ్ సాయి, టీడీపీ నాయకులు బాలాజీ, ప్రభాకర్ నాయుడు, రవి తదితరులు పాల్గొన్నారు.

పాలసముద్రం: శ్రీకావేరిరాజుపురంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 12 అర్జీలు రైతుల నుంచి వచ్చినట్లు తహసీల్దార్ అరుణకుమారి తెలిపారు. డీటీ ప్రవీణ్‌కుమార్, ఆర్ఐ దేవి, రాష్ట్ర టీడీపీ కార్యకర్యదర్శి భీమినేని చిట్టిబాబు నాయుడు, సర్పంచ్ మహేష్ నాయుడు, సర్వేయర్ గణేష్, వీఆర్వోలు, పాల్గొన్నారు.

విజయపురం: మండలంలోని ఆలపాకంలో పలువురు రైతులు తహసీల్దార్ కిరణ్‌కు అర్జీలు అందించారు. కార్యక్రమంలో డీటీ అశోక్, మండల సర్వేయర్ శేఖర్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పెనుమూరు: మండలంలో నంజరపల్లి, సీఆర్ కండ్రిగ రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దారు శ్రావణ్‌కుమార్‌కు రైతులు 29 ఫిర్యాదులు చేశారు. సెక్రటరీ సురేఖ, వీఆర్‌వోలు, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

అందుబాటులో లేని వ్యవసాయశాఖ అధికారులు

పెనుమూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలో వ్యవసాయ అధికారులు ఉన్నారా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. వ్యవసాయ కార్యాలయానికి వెళితే ఎవరూ ఉండరు.. రైతు సేవా కేంద్రాల్లోనూ కనిపించరు.. మరి ఎవరిని అడగాలి అని రైతులు సతమతమవుతున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రభుత్వం మామిడి రైతులకు బీమా సౌకర్యం కల్పించింది. డిసెంబరు 15వ తేదీలోపు సంబంధిత రైతు సేవా కేంద్రాలకు వెళ్లి వివరాలు నమోదు చేయాల్సి ఉంది. పెనుమూరు మండలంలో ఇంత వరకు ఏ ఒక్క రైతుకు ఈ బీమాపై అవగాహన కానీ, సమాచారం కానీ లేదు. రైతులే తెలుసుకుని వ్యవసాయశాఖ అధికారులను అడిగితే మాకు సంబంధంలేదు.. అది హార్టికల్చర్ వాళ్లు చూస్తారు అని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని కొందరు రైతులు వాపోతున్నారు. హార్టికల్చర్ అధికారి ప్రస్తుతానికి ఎవరూ లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా అధికారులు చొరవ తీసుకుని మామిడి రైతులకు అవగాహన కల్పించాలని కోరుతున్నారు.

మాజీ జడ్పీటీసీ సభ్యురాలి మృతికి పలువురి నివాళులు

విజయపురం, డిసెంబరు 11: (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంబాడలో మాజీ జడ్పీటీసీ సుజాతమ్మ మృతదేహానికి బుధవారం పలువురు నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. వడమాలపేట జడ్పీటీసీ మురళీధర్, పుత్తూరు మాజీ ఎంపీపీ ఏలుమలై(అమ్ములు), టీడీపీ రాష్ట్ర బీసీసెల్ అధికార ప్రతినిధి చుక్కా ధనుంజయయాదవ్, చిత్తూరు పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, రవిరాజు, కేసీ సుబ్రహ్మణ్యంరాజు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

సరస్వతి విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

వెదురుకుప్పం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో సరస్వతి విగ్రహ ఏర్పాటుకు బుధవారం పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ త్యాగరాజు భూమి పూజ చేశారు. రూ.లక్ష అంచనాతో యాజమాన్య కమిటీ చైర్మన్ త్యాగరాజు, వైస్ చైర్మన్ సంధ్య చంద్రశేఖర్, యువ నాయకులు విజయకుమార్, రాము వితరణతో నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. హెచ్‌ఎం కేశవులు, వ్యాయామ సంచాలకులు తిరుమలరాజు, ఉపాధ్యాయులు రంజిత్‌కుమార్, సరస్వతి, హరిత, మాలతి, సుబ్రహ్మణ్యంరెడ్డి, వెంకటరమణయ్య, ఢిల్లీబాబు, చిన్నయ్యశెట్టి, రాములు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో అయ్యప్ప స్వామి పూజలు ప్రారంభం

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గిరింపేట న్యూప్రశాంత్‌నగర్‌లో వెలసిన శాస్త్రగిరి అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం అయ్యప్ప స్వామి పూజా వారోత్సవాలు భక్తి ప్రపత్తులతో ప్రారంభమయ్యాయి. ఆలయ శుద్ధి, ప్రసాద సిద్ధి, కొడియెట్టా నక్షత్ర పూజ, కోడియం, భూతబలి, హరివరాసనం తదితర పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి భక్తులు, నగరవాసులు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొనగా, నిర్వాహకులు తీర్థ ప్రసాదాలుపంపిణీ చేశారు.

27న ఓసీ విద్యుత్ ఉద్యోగుల సమావేశానికి హాజరుకండి

ఐరాల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఈనెల 27న నెల్లూరులో నిర్వహించనున్న సమావేశానికి ఓసీ విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు తప్పక హాజరు కావాలని ఆ సంఘ ఆర్గనైజింగ్ కార్యదర్శి శేషాద్రిరెడ్డి, ఉమ్మడి జిల్లా కార్యదర్శి చంద్రమౌళి కోరారు. నెల్లూరులోని సీవీఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 10 గంటలకు సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో 2025వ సంవత్సర నూతన క్యాలెండరు, డైరీని ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఓసీ విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు తప్పకహాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

దుకాణాల అద్దె చెల్లించాలి

చిత్తూరు అర్బన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని మున్సిపల్ దుకాణాలకు సంబంధించిన అద్దెను సకాలంలో చెల్లించాలని సహాయ కమిషనర్ ప్రసాద్ దుకాణదారులకు సూచించారు. బుధవారం రెవెన్యూ అధికారులు జైహింద్ కాంప్లెక్స్, కస్తూరిబా మున్సిపల్ కాంప్లెక్సు గదుల అద్దె వసూళ్లు చేపట్టారు. సహాయ కమిషనర్ మాట్లాడుతూ దుకాణదారులు సత్వరం అద్దెను చెల్లించాలని, చెల్లించని దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న దుకాణాలకు నోటీసులు జారీ చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆర్వోలు గోపాలకృష్ణవర్మ, ఉమామహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

సారా కేసులో ఒకరి అరెస్టు

పాలసముద్రం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు నాటుసారాను అక్రమంగా తరలిస్తున్న ఒక వ్యక్తిని పట్టుకుని అరెస్టు చేసినట్లు ఎస్ఐ చిన్నరెడ్డెప్ప తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు బుధవారం వేకువజామున మండలంలోని నరసింహాపురం గ్రామం నుంచి తమిళనాడులోని మహంకాళిపురం గ్రామానికి చెందిన లోకనాథం 10 లీటర్ల నాటుసారా ప్యాకెట్లను మూటకట్టి తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. అతడి వద్ద ఉన్న సారాప్యాకెట్లను స్వాధీన పరచుకుని, అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

సారా స్వాధీనం, ఒకరి అరెస్టు

నగరి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలోని మాంగాడులో ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది నిర్వహించిన దాడులలో 110లీటర్ల సారా ఊట ధ్వంసం చేశారు. 5లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని దాము(40) అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. అనంతరం దళితవాడకు పడమర గల మురుగునీటి కాలువ వద్ద నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసును మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సురేంద్రబాబు, మునిరామయ్య, క్రిష్ణయ్య, విజయ్, రాజ్‌దీప్, గీత తదితరులు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక వేధింపులు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): నగరంలో పదో తరగతి చదువుతున్న ఓ బాలికపై డిగ్రీ చదువుతున్న యువకుడు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ విషయంపై బాలిక తల్లిదండ్రులు బుధవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. అయితే ఇది తమ పరిధిలోకి రాదంటూ ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్‌కు పంపించగా విచారణ జరుపుతున్నారు.

యువకుడిపై పోక్సో కేసు

బంగారుపాళ్యం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఓ బాలికకు మాయమాటలు చెప్పి గర్భవతిని చేసిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.బంగారుపాళ్యం మండలానికి చెందిన తుల సీరామ్ (20) ఓ బాలికకు మాయమాటలు చెప్పి గర్భవతి చేశాడని, బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బోల్తాపడిన టమోటా లారీ - తప్పిన ప్రమాదం

గుడిపాల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు-వేలూరు జాతీయ రహదారిలోని అనుప వద్ద మంగళవారం అర్ధరాత్రి టమోటా లారీ అదుపుతప్పి పడిపోవడంతో అందులో వున్న టమోటాలన్నీ నేలపాలయ్యాయి. ఆ సమయానికి ఎటువంటి వాహనాలు రాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.

వృద్ధాశ్రమంలో అన్నదానం

వెదురుకుప్పం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని వృద్ధాశ్రమంలోని వృద్ధులకు బుధవారం ఇదే మండలంలోని సీడీకండ్రిగకు చెందిన ఆకుల రాజగోపాల్ కుటుంబీకుల వితరణతో అన్నదానం జరిగింది. పండ్లు, స్వీట్లు కూడా పంపిణీ చేశారు.

పీహెచ్‌సీని సందర్శించిన ఎంపీడీవో

వెదురుకుప్పం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కత్తెరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం కార్వేటినగరం ఎంపీడీవో చంద్రమౌళి సందర్శించారు. వర్షం వస్తే ఉరుస్తోందని తెలియడంతో సందర్శించామని ఎంపీడీవో తెలిపారు.

టీడీపీలో పలువురి చేరిక



వైసీపీ నుంచి టీడీపీలో చేరుతున్న దయాలన్ తదితరులు

నగరి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని ఏకాంబరకుప్పంలో ఎస్‌ఏపీ దయాలన్, ఆయన అనుచరులు బుధవారం నగరి టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే భానుప్రకాష్ చేతుల మీదుగా టీడీపీ కండువా కప్పుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, చేనేత, మరమగ్గ కార్మికులకు కల్పించిన సదుపాయాలకు ఆకర్షితులమై టీడీపీలో చేరుతున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు రమేష్‌బాబు, కార్యదర్శి శ్రీనివాసన్, నాయకులు రజనీకాంత్, గుణశేఖర్, మది, మాణిక్యవాసన్ తదితరులు పాల్గొన్నారు